



# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 16 | ఎడిటర్: మేనం శ్యామ్ | మంగళవారం 04-08-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

నన్ను చూస్తే రహదారి అనిపిస్తానా...
ఒకప్పుడు గమ్యాలను కలిపిన నేను...
నేడు గుంతలతో గాయపడిన రహదారిని.
ప్రతి వాహనం నా బాధను మోస్తూ
కుదుపులతో ప్రయాణిస్తోంది.
నా గుండెల్లోని గుంతలు
మట్టిలో పడ్డ రంధ్రాలు కాదు...
ప్రజల సహనానికి పడ్డ పగుళ్లు.
వర్షం వస్తే చెరువుగా... ఎండ వస్తే దుమ్ము
తుఫానుగా మారుతున్నాను.
రాత్రి వేళ ప్రతి ప్రయాణికుడికి నేను
ప్రమాదకరమైన ఉచ్చుగా కనిపిస్తున్నాను.
రైతు పంట, విద్యార్థి భవిష్యత్తు, రోగి ప్రాణం
నా మీదే ఆధారపడి ఉన్నాయి.
ఇప్పుడు శంకుస్థాపనతో
ఆశల దీపం వెలిగింది.
హ్యామ్ విధానంలో అభివృద్ధి పనులు త్వరగా
పూర్తవుతాయని ఎదురుచూస్తున్నాను.
నాకు సభలు అవసరం లేదు...
ప్రసంగాలు అవసరం లేదు.
నా గాయాలపై పడే తారు చాలు...
ప్రజల సురక్షిత ప్రయాణమే నాకు పండుగ.
గుంతలతో గాయపడింది రహదారి మాత్రమే
కాదు... ప్రజల నమ్మకం కూడా.
ఆ నమ్మకాన్ని నిలబెట్టే సమయం
ఇప్పుడు వచ్చింది.
నన్ను బాగు చేయండి... వేల కుటుంబాల
ప్రయాణాన్ని భద్రంగా మార్చండి.
నేను కేవలం రహదారి కాదు...
ప్రజల జీవితాలకు దారి.ఆవేదనతో
ప్రభుత్వాన్ని వేడుకుంటున్న
ప్రధాన రహదారులు..

– వెంకటాపురం విష్ణు
..గుర్రంపోడు.

# స్పీకర్ నుండి హోమ్ శాఖ దాకా
# తెలంగాణ మంత్రి వర్గంలో కీలక మార్పులు

- పవర్ కారిడార్‌లో కొత్త సమీకరణాలు
- నెలాఖరులో కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధం
- గడ్డం ప్రసాద్‌కు హోం శాఖ
- బాలు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్
- అడ్లూరికి స్పీకర్ బాధ్యతలపై జోరుగా ప్రచారం
- నెలాఖరు మంత్రివర్గ విస్తరణపై అధికార పార్టీలో జోరుగా ఊహాగానాలు









**ప్రజా వాయిస్ ప్రత్యేక ప్రతినిధి,హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి కీలక పరిణామాలు చోటుచేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నెలాఖరులో మంత్రివర్గ విస్తరణతో పాటు శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవుల్లోనూ మార్పులు చోటు చేసుకోనున్నాయన్న ప్రచారం అధికార పార్టీలో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా ప్రస్తుతం స్పీకర్‌గా ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్‌కు రాష్ట్ర హోం శాఖ బాధ్యతలు అప్పగించే అవకాశాలపై కాంగ్రెస్ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. అదే సమయంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ బాధ్యతలు దాదాపు ఖరారైనట్లు, స్పీకర్ పదవిని అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు అప్పగించే సమీకరణాలు తెరపైకి వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ అంశాలపై ప్రభుత్వం లేదా కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

**రేవంత్ నమ్మకస్తుడికే హోం శాఖ..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుబంధమే ఈ ప్రచారానికి బలం చేకూరుస్తోందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రింటింగ్ ప్రెస్ రోజుల్లో ఇద్దరి మధ్య ఏర్పడిన సాన్నిహిత్యం ఇప్పటికీ కొనసాగుతోందని, సీఎం రేవంత్ రెడ్డి ఆయనను ఆప్యాయంగా "మామా" అని సంబోధిస్తుంటారన్న ప్రచారం కూడా రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అత్యంత కీలకమైన హోం శాఖ బాధ్యతలను ఆయనకు అప్పగించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**స్పీకర్ పీఠానికి గుడ్‌బై..**

హోం శాఖ బాధ్యతలు అప్పగిస్తే గడ్డం ప్రసాద్ కుమార్ స్పీకర్ పదవికి రాజీనామా చేసి మంత్రివర్గంలో

మిగతా 2లో

## కాంగ్రెస్‌కు సమాధి కట్టేది యువతే

- సీఎం రేవంత్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు!
- జాబ్ క్యాలెండర్ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీసిన కేటీఆర్
- నిరుద్యోగ యువతను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపణ
- మధిర యువకుడి సూసైడ్ నోట్ కాంగ్రెస్ పాలనపై ఛార్జ్‌షీట్ అని వ్యాఖ్య
- ఇంజినీర్లపై సీఎం వ్యాఖ్యలు అవమానకరమని మండిపాటు
- ప్రభుత్వం చెప్పిన ఉద్యోగాల సంఖ్యపై ప్రశ్నలు



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం ముదిరింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా జాబ్ క్యాలెండర్, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ యువత సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీశారు.

**యూత్ డిక్లరేషన్ పేరుతో మోసం**

ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పెద్ద ఎత్తున హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశ, నిస్పృహలో ఉందని పేర్కొన్నారు.

**మధిర యువకుడి సూసైడ్ నోట్ ప్రస్తావన**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

మిగతా 2లో

## లష్కర్ మహంకాళి రంగంలో భవిష్యవాణి

- భారీ వర్షాలు, వరదలు, అగ్నిప్రమాదాలపై హెచ్చరిక!
- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల్లో వైభవంగా 'రంగం' కార్యక్రమం
- మట్టి కుండపై నిలబడి భవిష్యవాణి వినిపించిన జోగిని మాతంగి స్వర్ణలత
- రాష్ట్రంలో కుంభవృష్టి, వరదలు, అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరిక
- అహంకారం పెరిగిందని, నైతిక విలువలు క్షీణిస్తున్నాయని ఆవేదన
- ఆరు నెలల్లో విగ్రహ ప్రతిష్ట చేయకపోతే ప్రాణనష్టం తప్పదని వ్యాఖ్య

2లో

## ఆగస్టు 5పై దేశవ్యాప్తంగా ఉత్కంఠ

- మోదీ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయానికి సిద్ధమా?
- ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య భూమిపూజ.. ఆగస్టు 5తో ప్రత్యేక అనుబంధం
- పార్లమెంట్ సమావేశాల వేళ కేంద్రంలో కీలక మంత్రాంగం
- మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్, కేబినెట్ విస్తరణపై ఊహాగానాలు
- రాజకీయ వర్గాల్లో మరో కీలక ప్రకటనపై చర్చ
- ఆగస్టు 5న కేంద్రం ఏ నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆసక్తి.



**న్యూఢిల్లీ, ప్రజా వాయిస్:**ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఆగస్టు 5 తేదీకి ప్రత్యేక రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది. గతంలో దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన కీలక నిర్ణయాలు ఈ తేదీన వెలువడటంతో, ఈ ఏడాది కూడా ఆగస్టు 5న మరో సంచలన నిర్ణయం వెలువడే అవకాశముందంటూ రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఢిల్లీలో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

**ఆగస్టు 5తో మోదీ ప్రభుత్వ అనుబంధం**

2019 ఆగస్టు 5న జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అమలు చేసింది. అనంతరం 2020 ఆగస్టు 5న అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణానికి భూమిపూజ నిర్వహించడం కూడా ఇదే తేదీన జరిగింది. దీంతో ఆగస్టు 5 మోదీ ప్రభుత్వానికి రాజకీయంగా

మిగతా 2లో

## బీజేపీ కంచుకోటలో పీకే జెండా

- తొలి ఎన్నికలోనే ప్రశాంత్ కిశోర్ ఘన విజయం!
- బంకీపూర్ ఉపఎన్నికలో బీజేపీపై సంచలన విజయం సాధించిన ప్రశాంత్ కిశోర్.
- 19,246 ఓట్ల మెజారిటీతో తొలి ఎన్నికలోనే విజయభేరి
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాజీనామాతో జరిగిన ఉపఎన్నిక
- మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న బంకీపూర్‌లో కమలనాథులకు షాక్
- తొలిసారి చట్టసభలో అడుగుపెట్టనున్న జన్ సూరజ్ వ్యవస్థాపకుడు

2లో

## సెమీ ఫైనల్స్‌కు సై..
## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రధాన పార్టీల ఫోకస్!




- హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్, వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నాహాలు.
- సుమారు 14 లక్షల మంది పట్టభద్రుల ఓటు.. మూడు పార్టీలకు ప్రతిష్ఠాత్మకం
- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల ఎంపికలో కసరత్తు
- అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తు సెమీ ఫైనల్స్‌గా రాజకీయ విశ్లేషణ.
- ఎమ్మెల్సీ ఫలితాలే భవిష్యత్ రాజకీయాలకు దిశానిర్దేశం చేయనున్నాయా?

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** తెలంగాణలో మరో ఎన్నికల సమరానికి ప్రధాన రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్, వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగే ఈ ఎన్నికలను ప్రధాన పార్టీలు రాజకీయ సెమీ ఫైనల్స్‌గా భావిస్తున్నాయి.

**14 లక్షల మంది పట్టభద్రుల తీర్పు**

ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు కలిపి సుమారు 14 లక్షల మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే అసెంబ్లీ ఎన్నికల్లోనూ సానుకూల వాతావరణం ఏర్పడుతుందనే అంచనాతో పార్టీలు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాయి.

**మార్చిలో ముగియనున్న పదవీకాలం**

హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న సురభి వాణీదేవి, వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఎమ్మెల్సీగా ఉన్న తీన్మార్ మల్లన్న పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 27తో ముగియనుంది. మార్చి 29లోపు కొత్త ఎమ్మెల్సీల ఎన్నిక ప్రక్రియ పూర్తికానుంది.

**కాంగ్రెస్‌లో టికెట్ కోసం పోటీ**

హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానం నుంచి టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి, తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు

మిగతా 2లో

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో కొత్త ట్విస్ట్

- ప్రేమలేఖలు, కత్తి స్వాధీనం!
- అశోక్‌నగర్ నివాసంలో సోదాలు
- ల్యాప్‌టాప్, ఫోన్‌తో పాటు కీలక ఆధారాల స్వాధీనం
- ఇద్దరి చేతిరాతతో రాసిన ప్రేమ లేఖలు, కత్తి స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఏపీకి చెందిన మహిళతో సన్నిహిత సంబంధాల కోణంలోనూ దర్యాప్తు
- ట్రైనీ మహిళా ఐపీఎస్ గదిలోకి బలవంతంగా వెళ్లిన ఘటనకు ఆధారాలు
- దాదాపు 20 మంది వాంగ్మూలాలు నమోదు
- కస్టడీకి తీసుకునేందుకు పోలీసుల ప్రయత్నాలు

2లో

# స్పీకర్ నుండి హోమ్ శాఖ దాకా
# తెలంగాణ మంత్రి వర్గంలో కీలక మార్పులు

మొదటి పేజీ తరువాయి

చేరనున్నారన్న ప్రచారం జరుగుతోంది. అనంతరం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవుల్లో మార్పులు చేపట్టేందుకు అధిష్ఠానం ఇప్పటికే కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. దీంతో శాసనసభలో కీలక రాజ్యాంగ పదవుల పునర్వ్యవస్థీకరణకు మార్గం సుగమం కానుందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

**రామచంద్ర నాయక్‌కు బ్రేక్..**
**బాలు నాయక్‌కు గ్రీన్ సిగ్నల్..**

డిప్యూటీ స్పీకర్ పదవికి తొలుత డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ పేరు ప్రధానంగా వినిపించింది. అయితే మంత్రి పదవి ఇవ్వాలని ఆయన పట్టుబట్టిన నేపథ్యంలో చివరి నిమిషంలో అధిష్ఠానం సమీకరణాలు మార్చినట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ బాధ్యతలు అప్పగించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు సమాచారం. బాలు నాయక్ ప్రమాణ స్వీకారం స్పీకర్ మార్పు అనంతరం జరిగే అవకాశాలున్నాయని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

**అడ్లూరికి స్పీకర్ బాధ్యతలా..**

గడ్డం ప్రసాద్ కుమార్ రాజీనామా అనంతరం స్పీకర్ పదవికి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేరును అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. అనుభవం, సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమతుల్యత వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**సామాజిక సమీకరణాలే వ్యూహమా..**

ఈ మార్పుల వెనుక సామాజిక, ప్రాంతీయ సమీకరణాలే ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గిరిజన (ఎస్టీ) సామాజిక వర్గానికి చెందిన బాలు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడం ద్వారా గిరిజన ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు మరింత బలం చేకూర్చాలన్న వ్యూహం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అలాగే ఉమ్మడి నల్గొండ జిల్లాకు మరో కీలక రాజ్యాంగ పదవి దక్కనున్న నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

**రంగారెడ్డి–వికారాబాద్‌కు పెరగనున్న ప్రాధాన్యం..**

గడ్డం ప్రసాద్ కుమార్‌కు హోం శాఖ బాధ్యతలు అప్పగిస్తే రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు రాష్ట్ర రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం పెరుగుతుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్రంలో అత్యంత కీలకమైన శాఖల్లో ఒకటైన హోం శాఖ ఆ ప్రాంత నాయకుడి చేతుల్లోకి వెళితే కాంగ్రెస్‌కు రాజకీయంగా కూడా ప్రయోజనం చేకూరుతుందని విశ్లేషిస్తున్నారు.

**వివేక్‌కు ఢిల్లీ అండ.. భట్టికి నో టచ్..**

మంత్రి వివేక్ వెంకటస్వామి శాఖల్లో మార్పులు ఉండొచ్చన్న ప్రచారం జరిగినప్పటికీ, ఢిల్లీలో ఆయనకున్న రాజకీయ సంబంధాలు, పార్టీ అధిష్ఠానంతో ఉన్న సాన్నిహిత్యం కారణంగా కేబినెట్‌లోనే కొనసాగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం. మరోవైపు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాఖల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని, ఆయన బాధ్యతలు యథాతథంగా కొనసాగనున్నాయని అధికార పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**కార్యకర్తల్లో ఉత్సాహం..**
**ప్రకటనపై ఉత్కంఠ..**

ఈ సమీకరణాలు అమలైతే దేవరకొండ, ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడకపోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిష్ఠానం నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**నెలాఖరులోనే పూర్తి క్లారిటీ..**

ఈ నెలాఖరులో జరగనున్న మంత్రివర్గ విస్తరణతో పాటు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవుల్లో మార్పులపై ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అప్పటి వరకు అధికార పార్టీలో కొనసాగుతున్న ఈ సమీకరణాలు తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## లష్కర్ మహంకాళి రంగంలో భవిష్యవాణి

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** సికింద్రాబాద్ లష్కర్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరలో అత్యంత కీలక ఘట్టమైన 'రంగం' కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో మట్టి కుండపై నిలబడి జోగిని మాతంగి స్వర్ణలత అమ్మవారి రూపంలో భవిష్యవాణి వినిపించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు.



**భారీ వర్షాలు, వరదలపై హెచ్చరిక**

ఈ ఏడాది రాష్ట్రంలో కుంభవృష్టి స్థాయిలో భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మాతంగి స్వర్ణలత హెచ్చరించారు. వరదల ఉధృతి పెరిగి ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే ఊహించని విధంగా అగ్ని ప్రమాదాలు కూడా చోటుచేసుకునే అవకాశముందని భక్తులను అప్రమత్తం చేశారు.

**సమాజంపై ఆవేదన**

సమాజంలో మానవ సంబంధాలు, నైతిక విలువలు క్షీణిస్తున్నాయని మాతంగి స్వర్ణలత ఆవేదన వ్యక్తం చేశారు. మనుషులు వావివరుసలు లేకుండా ఘోరాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోనని హెచ్చరించారు.తాను చెప్పిన మాటలను ప్రజలు పాటించడం లేదని ఆగ్రహంవ్యక్తం చేశారు.

**అహంకారం తగ్గించుకోవాలని సూచన**

ప్రజల్లో అహంకారం పెరిగిపోయిందని, దాన్ని తగ్గించుకుంటేనే అందరికీ మేలు జరుగుతుందని సూచించారు. ఈ సంవత్సరం తనను ఎంతో బాధపెట్టారని, కంటతడి పెట్టించారని అన్నారు. ఇక్కడికి సంతోషంగా రాలేదని, తీవ్ర ఆగ్రహంతో వచ్చానని పేర్కొన్నారు.

**విగ్రహ ప్రతిష్టపై కీలక వ్యాఖ్యలు**

ఆరు నెలల్లో విగ్రహ ప్రతిష్ట పూర్తి చేయకపోతే ప్రాణనష్టం తప్పదని అమ్మవారి రూపంలో హెచ్చరించారు. విగ్రహం ప్రతిష్ట చేస్తామని మాట ఇచ్చి నిలబెట్టుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తులు సమర్పించే పూజలు, నైవేద్యాలను స్వీకరిస్తున్నప్పటికీ, ఆలయంలో నియమాలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

## ఆగస్టు 5పై దేశవ్యాప్తంగా ఉత్కంఠ

మొదటి పేజీ తరువాయి

కీలకమైన తేదీగా మారింది.

**ఈసారి ఏ నిర్ణయం?**

ఈ నేపథ్యంలో మరోసారి ఆగస్టు 5 సమీపిస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసే అవకాశముందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. మహిళా రిజర్వేషన్ అమలు, డీలిమిటేషన్ ప్రక్రియ, కేంద్ర కేబినెట్ విస్తరణ వంటి అంశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**పార్లమెంట్ సమావేశాలపై దృష్టి**

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం కీలక బిల్లులను ముందుకు తీసుకురావాలనే వ్యూహంతో ఉన్నట్లు రాజకీయ విశ్లేషణలు చెబుతున్నాయి. పలు పార్టీల మద్దతుతో ముఖ్యమైన శాసన ప్రక్రియలను పూర్తి చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం కూడా ఉంది.

**అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపు**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం కేంద్ర కేబినెట్‌లో మార్పులు కూడా ఉండొచ్చన్న చర్చ కొనసాగుతోంది. అదే సమయంలో పాలనా పరమైన మరికొన్ని కీలక నిర్ణయాలను ప్రకటించే అవకాశముందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 5న ఎలాంటి నిర్ణయం ప్రకటించబోతుందనే విషయంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో కొత్త ట్విస్ట్

హైదరాబాద్, ప్రజా వాయిస్:ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై నమోదైన లైంగిక వేధింపుల కేసు దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బాధిత ట్రైనీ మహిళా ఐపీఎస్ ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. ఈ దర్యాప్తును నగర మహిళా భద్రత విభాగం డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ పర్యవేక్షిస్తున్నారు.



**నివాసంలో సోదాలు.. కీలక ఆధారాల స్వాధీనం**

సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో భాగంగా అధికారులు అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌తో పాటు ఇద్దరు వ్యక్తుల చేతి రాతతో రాసిన రెండు ప్రేమలేఖలు, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. వీటిని కేసులో కీలక ఆధారాలుగా పరిశీలిస్తున్నారు.

**మరో మహిళతో సన్నిహిత సంబంధాల కోణంలో దర్యాప్తు**

ప్రేమలేఖల్లోని వివరాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ మహిళతో ఉదయ్ కృష్ణారెడ్డికి సన్నిహిత పరిచయం ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. 2023 నుంచి భర్తకు దూరంగా కుమారుడితో ఉంటున్న ఆ మహిళకు ఉదయ్‌తో పరిచయం ఏర్పడి స్నేహంగా మారినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది.

**లివ్-ఇన్ ప్రతిపాదన చేసినట్లు సమాచారం**

హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న ఆ మహిళ, ఈ ఏడాది జనవరిలో ఉదయ్ కృష్ణారెడ్డి సూచన మేరకు ఉద్యోగం వదిలి అశోక్‌నగర్‌లోని ఐఏఎస్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరినట్లు సమాచారం. అనంతరం ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరగడంతో లివ్–ఇన్ రిలేషన్‌కు ఉదయ్ ప్రతిపాదించినప్పటికీ, చట్టపరంగా విడాకులు రాకపోవడంతో ఆమె నిరాకరించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.

**ట్రైనీ మహిళా ఐపీఎస్‌తో సమావేశం తర్వాత దూరం**

ఈ ఏడాది ఫిబ్రవరిలో బాధిత ట్రైనీ మహిళా ఐపీఎస్ ఆ మహిళను కలిసి తనకు ఎదురైన ఘటనలను వివరించినట్లు విచారణలో వెల్లడైంది. ఆ తర్వాత నుంచి ఆ మహిళ ఉదయ్ కృష్ణారెడ్డికి దూరంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

**20 మంది వాంగ్మూలాలు.. కస్టడీపై దృష్టి**

మహిళా ట్రైనీ ఐపీఎస్ గదిలోకి బలవంతంగా ప్రవేశించి ఫోన్ తీసుకున్న ఘటనకు సంబంధించిన ఆధారాలు కూడా లభించినట్లు తెలుస్తోంది. శిక్షణ సమయంలో ఉదయ్ కృష్ణారెడ్డి అసాధారణ ప్రవర్తన, తీవ్ర కోప స్వభావం వల్ల పలువురు మానసిక ఒత్తిడికి గురైనట్లు వాంగ్మూలాల్లో వెల్లడైనట్లు సమాచారం. ఇప్పటివరకు దాదాపు 20 మంది నుంచి వాంగ్మూలాలు నమోదు చేసిన పోలీసులు, మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఉదయ్ కృష్ణారెడ్డిని కస్టడీలోకి తీసుకునేందుకు కోర్టును ఆశ్రయించే ప్రక్రియలో ఉన్నారు.

## కాంగ్రెస్‌కు సమాధి కట్టేది యువతే

మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గం మధిరలో గడ్డం వేణు అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనను కేటీఆర్ ప్రస్తావించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాహుల్ గాంధీకి ఉద్దేశించి రెండు పేజీల లేఖ రాశాడని, అది సాధారణ సూసైడ్ నోట్ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జ్‌షీట్ అని వ్యాఖ్యానించారు.

**రేవంత్, రాహుల్‌పై విమర్శలు**

ఇంజినీర్లను "క్రిమినల్ వేస్ట్" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం తీవ్ర అవమానకరమని కేటీఆర్ మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించలేదని ఎద్దేవా చేశారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత ముందుకు వచ్చి మాట్లాడే ధైర్యం సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీకి లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా రాహుల్ గాంధీ కనిపించరని అన్నారు.

**ఉద్యోగాల భర్తీపై ప్రశ్నలు**

ప్రభుత్వం అసెంబ్లీలో ఇప్పటివరకు 16,979 ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేశామని చెప్పిందని గుర్తు చేసిన కేటీఆర్, తమ ప్రభుత్వ హయాంలో 2 లక్షల 32 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఎన్నడైనా పోటీ పరీక్షలు లేదా ప్రవేశ పరీక్షలు రాశారా అంటూ ప్రశ్నించారు.

**యువతే తీర్పు చెబుతుందన్న కేటీఆర్**

ప్రస్తుత ప్రభుత్వ పనితీరుపై యువతలో తీవ్ర అసంతృప్తి ఉందని కేటీఆర్ అన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు, నిరుద్యోగ యువతే కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రధాన పార్టీల ఫోకస్!

మొదటి పేజీ తరువాయి

శివసేనారెడ్డి, పార్టీ నేత గౌరీ సతీశ్ తదితరులు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ స్థానం నుంచి మాజీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, విజయా డెయిరీ మాజీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ప్రధాన పోటీదారులుగా ఉన్నారు.

**బీఆర్ఎస్ వ్యూహం**

హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ సిట్టింగ్ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ఈసారి పోటీకి దూరంగా ఉండే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆమె స్థానంలో ఓ మాజీ ఐఆర్ఎస్ అధికారిని బరిలోకి దింపే ఆలోచనలో బీఆర్ఎస్ ఉన్నట్లు సమాచారం. అలాగే మాజీ షాప్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత ఆంజనేయగౌడ్ కూడా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ స్థానం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన ఏనుగుల రాకేశ్‌రెడ్డినే మరోసారి బరిలోకి దించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**సెమీ ఫైనల్స్‌పై అందరి దృష్టి**

ఒకవైపు సీఎం రేవంత్ రెడ్డి 2034 వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేస్తుండగా, మరోవైపు బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తామని, బీజేపీ ప్రజలు తమకు అవకాశం ఇస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో కీలక సంకేతాలుగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



## కావేరీ జలాల కోసం ఇసుకలో పూడ్చుకొని రైతుల నిరసన.. కర్ణాటకపై మండిపాటు!

- తిరుచిరాపల్లిలో కావేరీ నదీ తీరంలో వినూత్న ఆందోళన.
- శరీరాలను ఇసుకతో కప్పుకొని నిరసన తెలిపిన తమిళనాడు రైతులు.
- ఖరీఫ్ పంటల కోసం వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్
- మేకేదాటు డ్యామ్ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకించిన రైతులు
- కావేరీ జలాల నిర్వహణ బోర్డు ఆదేశాలను అమలు చేయాలని విజ్ఞప్తి.

**తమిళనాడు, ప్రజా వాయిస్:** కావేరీ జలాల కోసం తమిళనాడు రైతులు మరోసారి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. తిరుచిరాపల్లిలో కావేరీ నదీ తీరంలో రైతు సంఘం నేత పీ అయ్యకణ్ణు ఆధ్వర్యంలో రైతులు తమ శరీరాలను ఇసుకతో కప్పుకొని ఆందోళన చేపట్టారు. ఖరీఫ్ పంటలను కాపాడేందుకు కర్ణాటక వెంటనే కావేరీ జలాలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

**కర్ణాటక వైఖరిపై ఆగ్రహం**

కావేరీ జలాల పంపిణీ విషయంలో కర్ణాటక ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమకు న్యాయంగా రావాల్సిన నీటిని విడుదల చేయకుండా, వరదల సమయంలో మాత్రమే మిగులు జలాలను వదులుతూ తమిళనాడును డ్రైనేజీలా చూస్తోందని ఆరోపించారు. దీంతో కావేరీపై ఆధారపడిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**మేకేదాటు ప్రాజెక్టుపై అభ్యంతరం**

కర్ణాటక ప్రతిపాదించిన మేకేదాటు డ్యామ్ ప్రాజెక్టును రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమిళనాడుకు చేరే నీటి పరిమాణం తగ్గి, కావేరీ డెల్టా ప్రాంతంలోని లక్షల ఎకరాల వ్యవసాయ భూములు తీవ్రంగా ప్రభావితమవుతాయని హెచ్చరించారు.

**నీటి విడుదలపై డిమాండ్**

కావేరీ జలాల నిర్వహణ బోర్డు నిర్దేశించిన నిబంధనల ప్రకారం కర్ణాటక తన వాటా నీటిని విడుదల చేయాలని రైతులు కోరారు. కర్ణాటక రిజర్వాయర్లలో 80 టీఎంసీలకు పైగా నీటి నిల్వలు ఉన్నప్పటికీ, కనీసం 3,500 క్యూసెక్కుల నీటిని కూడా విడుదల చేయడం లేదని విమర్శించారు.

**రాజకీయ నాయకులపై అయ్యకణ్ణు విమర్శలు**

ఇటీవల కేరళలో కురిసిన భారీ వర్షాలతో తమిళనాడుకు వరద నీరు చేరుతోందని రైతు నేత పీ అయ్యకణ్ణు తెలిపారు. ఆ నీటిని భవానీసాగర్ డ్యామ్‌కు మళ్లించే అవకాశం ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని రాజకీయ నాయకులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కర్ణాటక వెంటనే నీటిని విడుదల చేయకపోతే భవిష్యత్తులో ఆ రాష్ట్రానికే తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

## బీజేపీ కంచుకోటలో పీకే జెండా

**పట్నా, ప్రజా వాయిస్:** పలు రాజకీయ పార్టీలకు ఎన్నికల వ్యూహకర్తగా పనిచేసిన జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) ప్రత్యక్ష రాజకీయాల్లో తొలి అడుగులోనే ఘన విజయాన్ని నమోదు చేశారు. బిహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై 19,246 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈ విజయంతో ప్రశాంత్ కిశోర్ తొలిసారిగా చట్టసభలో అడుగుపెట్టనున్నారు.



**బీజేపీ కంచుకోటలో సంచలనం**

బంకీపూర్ అసెంబ్లీ స్థానం గత మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా కొనసాగుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఈ స్థానం నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఈ ఉపఎన్నిక అనివార్యమైంది. అధికార పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమని భావించిన బీజేపీకి పీకే విజయం పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

**తొలి రౌండ్ నుంచే ఆధిక్యం**

జూలై 30న జరిగిన పోలింగ్‌కు ఆగస్టు 3న ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మొత్తం లెక్కింపు ప్రక్రియలో తొలి రౌండ్ నుంచే ప్రశాంత్ కిశోర్ ఆధిక్యంలో నిలిచారు. ప్రతి రౌండ్‌లోనూ తన ఆధిక్యాన్ని పెంచుకుంటూ చివరకు 19,246 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు.

**చరిత్ర తిరగరాసిన పీకే**

2008లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఏర్పడిన బంకీపూర్ నియోజకవర్గంలో బీజేపీ వరుస విజయాలు నమోదు చేసింది. అంతకు ముందు పట్నా పశ్చిమ నియోజకవర్గంగా ఉన్నప్పటి నుంచి కూడా బీజేపీ ఆధిపత్యం కొనసాగింది. అలాంటి నియోజకవర్గంలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం బిహార్ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది.

**రాజకీయంగా కొత్త అధ్యాయం**

ఎన్నికల వ్యూహకర్తగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రశాంత్ కిశోర్ ఇప్పుడు ప్రజా ప్రతినిధిగా చట్టసభలో అడుగుపెట్టనున్నారు. ఈ విజయం జన్ సూరజ్ పార్టీకి ఊతమివ్వడంతో పాటు, రానున్న బిహార్ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## లష్కరే తొయ్యిబా కీలక సభ్యుడి సంచలన వ్యాఖ్యలు

- 'మా సంస్థకు చెందిన 30 మందికి పైగా హతమయ్యారు'
- వైరల్ వీడియోలో కీలక విషయాలు వెల్లడించిన రిజ్వాన్ హనీఫ్
- పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో వరుసగా హతమైన ఉగ్రవాదులపై వ్యాఖ్యలు
- గుర్తు తెలియని వ్యక్తుల దాడుల్లో 30 మందికి పైగా మృతి చెందారని అంగీకారం
- ఈ హత్యల వెనుక భారత్ ఉందని ఆరోపించిన రిజ్వాన్
- ఆ ఆరోపణలను భారత్ ఖండించగా.. హత్యల వెనుక ఎవరున్నారనే దానిపై అధికారిక నిర్ధారణ లేదు.



**ప్రజా వాయిస్, అంతర్జాతీయ డెస్క్:** పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తొయ్యిబా కీలక సభ్యుడు రిజ్వాన్ హనీఫ్‌కు సంబంధించిన ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఆ వీడియోలో గత మూడు నుంచి నాలుగేళ్ల కాలంలో పాకిస్థాన్‌తో పాటు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో తమ సంస్థకు చెందిన 30 మందికి పైగా సభ్యులు గుర్తు తెలియని వ్యక్తుల దాడుల్లో మరణించారని అతడు వెల్లడించినట్లు తెలుస్తోంది.

**పలు నగరాల్లో వరుస హత్యలు**

పెషావర్, కరాచీ, రావల్పిండి, రావలాకోట్, ముజఫరాబాద్ తదితర ప్రాంతాల్లో లష్కరే తొయ్యిబాకు చెందిన కార్యకర్తలు వరుసగా హత్యకు గురయ్యారని రిజ్వాన్ పేర్కొన్నాడు. గత కొన్నేళ్లుగా తమ సంస్థ సభ్యులనే లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరుగుతున్నాయని వీడియోలో చెప్పినట్లు ప్రచారం సాగుతోంది.

**భారత్‌పై ఆరోపణలు**

ఈ హత్యల వెనుక భారత సంస్థలు ఉన్నాయని రిజ్వాన్ వీడియోలో ఆరోపించాడు. అయితే ఈ ఆరోపణలను భారత్ అధికారికంగా తిరస్కరించింది. ఈ ఘటనల వెనుక ఎవరున్నారనే దానిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ధారణ వెలువడలేదు.

**నిఘా వర్గాల ధ్రువీకరణ**

వైరల్ వీడియోలో కనిపిస్తున్న వ్యక్తి భారత్‌కు కావాల్సిన లష్కరే తొయ్యిబా సీనియర్ ఉగ్రవాది రిజ్వాన్ హనీఫేనని, వీడియో ప్రామాణికతను భారత నిఘా వర్గాలు నిర్ధారించినట్లు సమాచారం.

**ఉగ్ర సంస్థపై అంతర్జాతీయ నిషేధం**

2008 ముంబై ఉగ్రదాడులతో పాటు భారత్‌లో పలు ఉగ్రకార్యకలాపాలకు బాధ్యమైన లష్కరే తొయ్యిబాను ఐక్యరాజ్యసమితితో పాటు అనేక దేశాలు నిషేధిత ఉగ్రవాద సంస్థగా ప్రకటించాయి. అలాంటి సంస్థకు చెందిన సభ్యులు వరుసగా హతమవుతున్నట్లు వెలుగులోకి రావడం అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ ఘటనల వెనుక ఉన్న కారణాలు, బాధ్యులపై అధికారికంగా ఎలాంటి స్పష్టత ఇంకా వెలువడలేదు.



## బీసీ స్కూల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి స్థల పరిశీలన

- నందికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రాజా ప్రసాద్.

**ప్రజా వాయిస్/ నల్గొండ క్రైమ్:** నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు రోడ్డు దాటేందుకు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునిస్థల పరిశీలన చేసిన ప్రజాప్రతినిధులు అధికారులు నాగార్జున్ సాగర్ బీసీ స్కూల్ వద్ద నిర్మాణం చేయనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జికు నిర్మాణం సంబంధించిన స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా నందికొండ పురపాలక సంఘం వైస్ చైర్మన్ రాజా ప్రసాద్ మాట్లాడుతూ నాగార్జునసాగర్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ వద్ద రోడ్డు దాటేందుకు పాదచారుల భద్రత కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జిసాగర్ బీసీ స్కూల్ విద్యార్థులు నిత్యము రోడ్డుని దాటవలసి వస్తుండడంతో స్థానిక ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ఫుట్ ఒవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం 47 లక్షల నిధులను మంజూరు చేశారు దీనికి సంబంధించిన పనులకు త్వరలోనే ప్రారంభం చేసినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవికుమార్ స్థానిక ప్రజాప్రతినిధులు సుమన్, బిన్నీ, నాగరాజు, చందు అధికారులు తదితరులు పాల్గొన్నారు...

# ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతుల నిరీక్షణ

- కోదాడ డివిజన్‌లో నాట్ల సీజన్‌లోనే తీవ్ర జాప్యం
- మరమ్మతులకు 15,20 రోజులు పడుతుండటంతో నిలిచిపోయిన సాగు
- జులైలో వచ్చిన 45 ట్రాన్స్‌ఫార్మర్లలో 37 ఇంకా పెండింగ్‌లోనే
- నారు ముదిరిపోతుందంటూ కౌలు రైతుల ఆందోళన
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్న అన్నదాతలు



**ప్రజా వాయిస్,కోదాడ:**వానలు పడి పంటలు పచ్చగా కళకళలాడాల్సిన వేళ కోదాడ డివిజన్ రైతు కళ్ళల్లో మాత్రం కన్నీటి చినుకులే కురుస్తున్నాయి. పొలంలో నారు సిద్ధంగా ఉంది. కూలీలు సిద్ధంగా ఉన్నారు.కానీ నీరు పెట్టే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో అన్నదాత చేతులెత్తేశాడు.వ్యవసాయానికి ప్రతి గంట విలువైన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు 15 నుంచి 20 రోజులు పడుతుందని అధికారులు చెప్పడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

**పంటతో పాటు రైతు ధైర్యం కూడా ఎండిపోతోంది**

ఒక ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే అది కేవలం విద్యుత్ సమస్య కాదు ఒక గ్రామం వ్యవసాయం నిలిచిపోవడం. నారు ముదిరిపోవడం. కూలీలకు ఇచ్చిన డబ్బు వృథా కావడం. అప్పులు చేసిన రైతు గుండె పగిలిపోవడం. పంట చేతికి వస్తుందో లేదో అనే భయం. ఈ బాధలన్నీ ఇప్పుడు కోదాడ రైతు నిత్యకృత్యంగా మారిపోయాయి.

**పెండింగ్‌ల పర్వతం... రైతుల నిరీక్షణ**

జులై నెలలో 45 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు వచ్చినా, వాటిలో 37 ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఆగస్టు ప్రారంభంలోనే మరో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. మరమ్మతులకు నాలుగు యంత్రాలు, పరిమిత సిబ్బందే ఉండటంతో రైతుల ఎదురు చూపులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కార్యాలయాల ముందు ట్రాన్స్‌ఫార్మర్ల వరుస వాటి పక్కనే రైతుల ఆవేదన కనిపిస్తోంది.

**కౌలు రైతుకు కష్టాల కడలి**

ఎల్‌నినో హెచ్చరికల మధ్య కూడా అప్పులు చేసి కౌలు భూములు తీసుకున్న రైతులు ఇప్పుడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. సొంత భూమి కంటే కౌలు భూముల్లోనే ఎక్కువ మంది సాగు చేస్తున్నారు. నారు సిద్ధం చేసిన తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో నాట్లు వేయలేక, రోజులు గడిచేకొద్దీ నారు వృద్ధాప్యం చెందుతోంది. పంట ఆలస్యమైతే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**రైతు ప్రశ్నకు సమాధానం దొరుకుతుందా.?**

రైతే దేశానికి వెన్నెముక అని చెప్పే పాలకులు వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పే అధికారులు నాట్ల సీజన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతు మూడు వారాలు ఎదురు చూడాల్సిన పరిస్థితిని ఎలా సమర్థించుకుంటారు కాలిపోతున్నది ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే కాదు. రైతు ఆశ, రైతు నమ్మకం, రైతు భవిష్యత్తు కూడా అని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రత్యేక చర్యలు తీసుకుని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులను వేగవంతం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

**మా బాధ ఎవరికీ కనిపించడం లేదా.?**



రైతు చిన్నబాబు

మూడు ఎకరాలు కౌలు, మూడు ఎకరాలు సొంత భూమిలో సాగు చేస్తున్నాను. నారు సిద్ధంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. వెంటనే కార్యాలయానికి తీసుకొచ్చాం. 20 రోజులు పడుతుందని చెబుతున్నారు. అప్పులపై సాగు చేసిన మా పరిస్థితి ఎవరికీ పట్టడం లేదు అని రైతు చిన్నబాబు కన్నీటి పర్యంతమయ్యాడు.


**40 మంది కూలీలతో నారు పీకించాం..**



రైతు దూదియ బిక్యాతండ

రైతు ఆవేదన40 మంది కూలీలతో నారు పీకించాం. అదే రోజు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. కూలీల ఖర్చు మా జేబు నుంచి పోయింది. ఇప్పుడు నారు ఎండిపోతోంది. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వకుండా 20 రోజులు ఆగమంటే రైతు ఎలా బతుకుతాడు అని ప్రశ్నించాడు.



## హుజూర్ నగర్ స్వర్ణకారుడికి బెంగళూరు పోలీసుల నోటీసులు

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్,** ఆగష్టు 3సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్‌కు చెందిన ఒక జ్యువెలరీ షాప్ యజమానికి బెంగళూరు లోని కె.ఆర్.పురం పోలీసులు కీలక నోటీసులు జారీ చేశారు.

**కేసు వివరాలు**

బెంగళూరు కె.ఆర్. పురం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ నంబర్ 414/2026 (భారతీయ న్యాయ సంహిత – బియన్ఎస్ 2023 సెక్షన్లు 305, 331(4) కింద) కేసు దర్యాప్తులో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. రాఘవేంద్ర అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

**విచారణకు హాజరు కావాలని ఆదేశం**


హుజూర్ నగర్‌లోని 'శ్రీ వీర బ్రహ్మేంద్ర సాయినాథ్ జ్యువెలరీ' యజమాని నెమ్మోజు నవీన్‌కు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 94 కింద ఈ నోటీసులు అందజేశారు. ఆగస్టు 5న ఉదయం 11:00 గంటలకు బెంగళూరులోని కె.ఆర్. పురం పోలీస్ స్టేషన్‌లో దర్యాప్తు అధికారి పిఎస్సై మహేష్ ముందు హాజరు కావాలని ఆదేశించారు.

**సమర్పించాల్సిన ఆధారాలు**

విచారణ నిమిత్తం క్రింది వివరాలను వెంట తెచ్చి సమర్పించాలని పోలీసులు సూచించారుబంగారం విక్రయ రశీదులు ఆధార్ కార్డు మరియు గుర్తింపు పత్రాలు జూన్ 18 మరియు 19 (2026) తేదీలకు సంబంధించిన షాప్ సీసీటీవీ ఫుటేజ్‌లెడ్జర్ మరియు జర్నల్ ఖాతా పుస్తకాలునోటీసులకు స్పందించకపోతే లేదా విచారణకు సహకరించకపోతే బియన్ఎస్ సెక్షన్ 210 కింద చట్టపరమైన తీవ్ర చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు.

## గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో మృత్యు వలలు

- ప్రమాదం జరిగే వరకు అధికారుల నిద్ర లేవరా?
- నిత్యం కంటిముందే కనిపిస్తున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరం!



**ప్రజా వాయిస్ గోదావరిఖని** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అత్యంత రద్దీగా ఉండే గోదావరిఖని ప్రధాన చౌరస్తా ఇప్పుడు ప్రమాదాలకు అడ్డాగా మారింది. చౌరస్తా నడిబొడ్డున ఉన్న విద్యుత్ స్తంభాలపై కరెంటు, కేబుల్ తీగలు అస్తవ్యస్తంగా, విపరీతంగా కిందకు వేలాడుతూ బాటసారులను, వాహనదారులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. నిత్యం కంటిముందే కనిపిస్తున్న ఈ ప్రమాదకర దృశ్యాలు విద్యుత్ శాఖ అధికారులకు ఎందుకు కనబడటం లేదు? ఏ క్షణంలో ఏ చిన్న షార్ట్ సర్క్యూట్ జరిగినా భారీ అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఉందని తెలిసి కూడా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు? ప్రమాదం జరిగి అమాయకుల ప్రాణాలు పోయాక గానీ స్పందించరా? పరిపరి విధాలా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక అంతర్యమేమిటి?

**తక్షణమే చర్యలు చేపట్టాలి**

లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని అభివృద్ధి పేరిట ఖర్చు చేస్తున్న పాలకులు, అధికారులు.. ప్రజా రక్షణను గాలికి వదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు మరియు మున్సిపల్ యంత్రాంగం తక్షణమే స్పందించి, యుద్ధప్రాతిపదికన ఈ వేలాడుతున్న తీగలను తొలగించి సరిచేయాలని స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు.


## నిషేధిత జాబితాలో వెంచర్ లు

- ఇదెక్కడి అన్యాయం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

**ప్రజావాయిస్/వికారాబాద్:** అనుమతులు కలిగిన లే అవుట్ లను నిషేధిత జాబితాలో చేర్చడం వెనుక ఆంతర్యమేమిటి అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలో పిఓబీ జాబితా మూలంగా సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు సంఘీభావం తెలిపారు.కలెక్టరేట్ ఎదుట న్యాయం కోసం నిరసన చేపడుతున్న బాధితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రొహిబిటెడ్ ల్యాండ్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడి, బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రజల హక్కులను కాపాడటం మన బాధ్యత, బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు,తదితరులు పాల్గొన్నారు.



## చీకట్లో నిడమనూరు



- 29 గ్రామాల్లో విద్యుత్ సంక్షోభం
- ప్రధాన గ్రామపంచాయతీలకూ తప్పని కోతలు
- గంటల తరబడి నిలిచిపోతున్న సరఫరా
- రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, ప్రజలపై తీవ్ర ప్రభావం
- విద్యుత్ శాఖ తక్షణమే స్పందించాలని డిమాండ్

**ప్రజా వాయిస్,నిడమనూరు**.నిడమనూరు మండలంలో విద్యుత్ సరఫరా తీవ్ర సంక్షోభంగా మారింది. మండలంలోని దాదాపు 29 గ్రామాలతో పాటు ప్రధాన గ్రామపంచాయతీల్లోనూ ప్రతిరోజూ గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్దిష్ట సమయాలు లేకుండా వరుసగా విద్యుత్ కోతలు కొనసాగుతుండటంతో సాధారణ జీవనం అస్తవ్యస్తమైంది. మండలవ్యాప్తంగా విద్యుత్ సమస్యపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు పలుమార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో ఇళ్లలో రోజువారీ పనులు స్తంభిస్తున్నాయి. ఉక్కపోత మధ్య విద్యుత్ లేక చిన్నారులు, వృద్ధులు, మహిళలు, అనారోగ్యంతోబాధపడుతున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో కూడా విద్యుత్ అంతరాయాలు కొనసాగుతుండటంతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.వ్యవసాయ రంగంపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా కనిపిస్తోంది. బోర్లు, పంపుసెట్లు విద్యుత్ లేక పనిచేయక సాగునీటి సరఫరా నిలిచిపోతోంది. పంటలను కాపాడుకునేందుకు రైతులు రాత్రింబవళ్లుఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీల్లో తాగునీటి మోటార్లు సకాలంలో పనిచేయక నీటి సరఫరా కూడా అంతరాయం కలుగుతోంది. పలు గ్రామాల్లో తాగునీటి సమస్య రోజురోజుకూతీవ్రతరమవుతోందని స్థానికులు చెబుతున్నారు.చిన్న పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు విద్యుత్ కోతల కారణంగా పనులు నిలిపివేయాల్సి వస్తోందని వ్యాపారులు వాపోతున్నారు. విద్యార్థులు పరీక్షల సన్నాహకాల్లో ఉండగా రాత్రి వేళల్లో విద్యుత్ లేక చదువులకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కోతలపై అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం లేకపోవడం ప్రజల్లో మరింత అసహనాన్ని పెంచుతోంది. మరమ్మతులు, నిర్వహణ పనులు ఉంటే ముందుగానే సమాచారం ఇవ్వాలని, లేకపోతే నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని 29 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్యకు తక్షణ పరిష్కారం చూపకపోతే ఆందోళన బాట పట్టక తప్పదని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.



## ఆర్‌టీఐ దరఖాస్తు చేస్తే బెదిరింపులా?

- ఎమ్మార్వో కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆర్డిఓ కు ఫిర్యాదు
- ప్రాణహాని ఉందంటూ బాధితుల ఆవేదన
- కాల్ రికార్డింగ్‌లు ఉన్నాయని వెల్లడి
- సమాచారం కోరినందుకే వేధింపులని ఆరోపణలు
- సమగ్ర విచారణ చేసి రక్షణ కల్పించాలని వినతి

**ప్రజా వాయిస్,మిర్యాలగూడ**.సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద దరఖాస్తులు చేసినందుకు నిడమనూరు ఎమ్మార్వో కార్యాలయంలోని ఎంఆర్ఓ జంగాల కృష్ణయ్యతో పాటు మరికొందరు తమను బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ నిడమానూరు మండలం వేణిగండ్ల గ్రామానికి చెందిన పలువురు బాధితులు సోమవారం మిర్యాలగూడ ఆర్డిఓ రమణారెడ్డి కి లిఖితపూర్వకంగా ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు.బాధితులు ముదిగొండ్ల గోపాల్, ముదిగొండ్ల ఈశ్వర్, ముదిగొండ్ల కోటేష్, కట్టబోయిన గోవర్ధన్‌లు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, భూ సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని పొందేందుకు గతంలో నిడమానూరు తహసీల్దార్ కార్యాలయంలో పలుమార్లు ఆర్‌టీఐ దరఖాస్తులు సమర్పించామని తెలిపారు. ఆ దరఖాస్తులకు సంబంధించిన సమాచారాన్ని స్థానిక ఎంఆర్ఓ జంగాల కృష్ణయ్య ప్రైవేటు వ్యక్తులకు చేరవేశారని ఆరోపించారు.దీని నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 20న కొందరు ప్రైవేటు వ్యక్తులు ఫోన్ చేసి బెదిరించారని, అప్పట్లోనే ఆర్డీఓకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు పేర్కొన్నారు.అలాగే జూలై 30న సాయంత్రం ఆర్‌టీఐ దరఖాస్తు సమర్పించేందుకు వెళ్లిన ముదిగొండ్ల కోటేష్‌ను కార్యాలయంలో ఉన్న కొందరు వ్యక్తులు బూతులు తిడుతూ, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భూమి రికార్డులు, పట్టాలకు సంబంధించిన విషయాల్లో సంతకాలు చేస్తే కేసుల్లో ఇరికిస్తామని బెదిరించినట్లు తెలిపారు.జూలై 31న దరఖాస్తును స్వీకరించినప్పటికీ, ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది తమ పట్ల విచిత్రంగా ప్రవర్తిస్తూ నిరంతరం బెదిరింపులకు పాల్పడుతున్నారని, తమకు ప్రాణహాని ఉందని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. బెదిరింపులకు సంబంధించిన కాల్ రికార్డింగ్‌లు తమ వద్ద ఉన్నాయని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తమకు రక్షణ కల్పించాలని ఆర్డిఓ ను కోరారు.

## మంథనిలో 'కోతుల' రాజ్యం.. భయంలో ప్రజలు!

- పట్టించుకోని మున్సిపల్ చైర్మన్
- మంత్రి శ్రీధర్ బాబు సీరియస్

**ప్రజా వాయిస్ మంథని** పెద్దపల్లి జిల్లా మంథని పురపాలక సంఘ పరిధిలో కోతుల బెడద తీవ్ర స్థాయికి చేరింది. రోజురోజుకూ పెరుగుతున్న కోతుల మూకలతో స్థానిక ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర అల్లాడిపోతున్నారు. వీధుల్లో తిరగాలన్నా, ఇంట్లో ప్రశాంతంగా ఉండాలన్నా భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది.

**ఇళ్లలోకి చొరబడి బీభత్సం:**

మంథని పట్టణంలోని పలు వార్డుల్లో కోతులు గుంపులు గుంపులుగా చేరి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇళ్ల తలుపులు కాస్త తెరిచి ఉంటే చాలు నేరుగా లోపలికి జొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలపై దాడులకు తెగబడుతుండటంతో బయటకు రావాలంటేనే జంకుతున్నారు. వ్యాపార సముదాయాల వద్ద కొనుగోలుదారుల చేతుల్లోని సంచులను లాక్కుంటుండటంతో వర్తకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ ప్రజలు ఇంతటి అవస్థలు పడుతున్నా మున్సిపల్ చైర్మన్, సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు విన్నవించినా, అధికారుల నుంచి ఎలాంటి స్పందన కరువైంది. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన మున్సిపల్ చైర్మన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణవాసులు మండిపడుతున్నారు.

**మంత్రి శ్రీధర్ బాబు సీరియస్:**

మంథని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సొంత నియోజకవర్గం. నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి నిరంతరం శ్రమిస్తుంటే, స్థానిక మున్సిపల్ చైర్మన్ నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. శ్రీధర్ బాబుకు చెడ్డపేరు తెచ్చేలా చైర్మన్ వ్యవహరిస్తుండటంపై సొంత పార్టీ నేతల్లోనూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజా సమస్యలపై మున్సిపల్ చైర్మన్ చూపుతున్న అలసత్వం, పట్టులేని పాలనపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇకనైనా స్పందించి కోతుల బెడద నుండి మంథని ప్రజలకు విముక్తి కలిగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





# చలో ఢిల్లీ

- ఎస్టీ హోదా కోసం మాలి కులస్తుల ఉద్యమం

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో తెలంగాణ మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లేండుగురే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి వసంతరావు ఆధ్వర్యంలో వరుస సమావేశాలు జరుగుతున్నాయి. బెజ్జూర్, చింతలమానేపల్లి, కౌటాల, సిర్పూర్ తదితర మండలాల్లో మాలి సంఘం నాయకులతో ఈ భేటీలు కొనసాగుతున్నాయి.మాలి కులస్తులకు ఎస్టీ హోదా సాధన కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నారు. వీటిని విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై సమావేశాల్లో చర్చిస్తున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వివిధ జిల్లాల మండలాలు, గ్రామాల నుంచి సంఘం ప్రతినిధులను కలుస్తూ ఉద్యమాన్ని బలోపేతం చేస్తున్నారు.ప్రతి జిల్లా నుంచి అధిక సంఖ్యలో సభ్యులు ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు లేండుగురే శ్యాంరావు తెలిపారు. సమావేశాలకు మాలి సంఘం రాష్ట్ర నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, మాలి కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు.

# అక్రమాలకు అడ్డుకట్ట.. కోట్లలో ధాన్యం కాజేసిన రైస్ మిల్లర్ అరెస్ట్!

- సంచలనం సృష్టించిన సిఎంఆర్ అక్రమ వాడకం కేసు
- రూ. 15.70 కోట్ల ప్రభుత్వ ధాన్యం మాయం చేసిన యజమాని గంప సంతోష్ రిమాండ్!

**ప్రజా వాయిస్, మంచిర్యాల జిల్లా**, దండేపల్లి మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. రైతుల కష్టార్జితాన్ని, ప్రభుత్వ ఆస్తులను కాజేసిన ప్రబుద్ధుల భాగోటాన్ని బట్టబయలు చేశారు. దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏకంగా రూ. 15.70 కోట్ల విలువైన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్)ను అక్రమంగా దారి మళ్లించిన రైస్ మిల్లు యజమానిని సోమవారం సీఐ రమణమూర్తి పక్కా సమాచారంతో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మంచిర్యాల జిల్లా మేనేజర్ శ్రీకళ అందించిన ఫిర్యాదు మేరకు క్రైం నెం. 151/2026, బిఎన్ఎస్ చట్టంలోని సెక్షన్లు 316(5), 316(2), 318(4) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.గంప సంతోష్ (తండ్రి: రాజేశం) యజమానిగా ఉన్న ఎం/ఎస్ రామ లక్ష్మణ్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు ఈ అక్రమాలకు సంబంధం ఉన్నట్లు తేలింది. 2022-23 మరియు 2023-24 సీజన్లలో ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎమ్ఎస్పి)తో రైతుల నుంచి సేకరించిన మొత్తం 9,244.206 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం ఈ మిల్లుకు అప్పగించారు.నిబంధనల ప్రకారం మిల్లర్ ప్రభుత్వానికి 6,286.059 మెట్రిక్ టన్నుల సిఎంఆర్ (బియ్యం)ను తిరిగి అప్పగించాలి. కానీ, కేవలం 1,833.511 మెట్రిక్ టన్నులు మాత్రమే మళ్లించి, మిగిలిన 4,452.548 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అక్రమంగా కాజేశారు.అధికారులు మిల్లులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, ప్రాంగణంలో ప్రభుత్వానికి సంబంధించిన ఒక్క గింజ ధాన్యం గానీ, బియ్యం నిల్వలు గానీ లేకపోవడం గమనించారు. ముందస్తు పథకం ప్రకారం ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయించి, సుమారు రూ. 15.70 కోట్లకు పైగా ప్రభుత్వ ఆస్తిని దుర్వినియోగం చేసినట్లు విచారణలో నిర్ధారణ అయింది.దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఈ కేసు దర్యాప్తును సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణమూర్తి, ఎస్సై రాజా వర్ధన్ మరింత లోతుగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను అన్యాక్రాంతం చేస్తే చట్టపరంగా ఎంతటివారైనా కఠిన శిక్ష తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు.



# సరండిలో నిరుపయోగంగా డంపింగ్ యార్డు

- వృథాగా లక్షల ప్రజాధనం

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామ పంచాయతీలో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన డంపింగ్ యార్డు వినియోగానికి నోచుకోకుండా నిరుపయోగంగా మారింది. యార్డుకు వెళ్లే మార్గంలో కెనాల్ కాలువ అడ్డుగా ఉండి, వంతెన లేదా కల్వర్టు లేకపోవడంతో చెత్త సేకరణ వాహనాలు అక్కడికి చేరుకోలేకపోతున్నాయి. నిర్మాణం పూర్తయి చాలాకాలమైనా ఇప్పటివరకు ఒక్క ట్రాక్టర్ చెత్త కూడా అక్కడ వేయలేదని గ్రామస్థులు తెలిపారు.దీంతో గ్రామంలోని రహదారుల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్తను తాత్కాలికంగా వేయాల్సి వస్తోంది. వర్షాకాలంలో ఈ చెత్త మురుగు కాలువలను మూసుకుపోయేలా చేస్తూ, మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. దోమలు, ఈగలు పెరిగి డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాల ముప్పు పొంచి ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు సైతం చెత్త వేసేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు.నిర్మాణానికి ముందు మార్గం, కాలువ అడ్డంకి వంటి ప్రాథమిక అంశాలు పరిశీలించకపోవడం వల్లే ప్రజాధనం వృథా అయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం యార్డు పిచ్చిమొక్కలతో నిండిపోయింది. కెనాల్‌పై వంతెన లేదా కల్వర్టు నిర్మించి శాశ్వత రహదారి ఏర్పాటు చేయాలని, అవసరమైతే ప్రత్యేక నిధులు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని జిల్లా, మండల అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.



# మూత్రశాలలు కంపుగా.. కార్యాలయాలు చెత్తగా

- అదికారుల మాటల్లో స్వచ్ఛ భారత్ చేతల్లో చెత్త రాజ్యం
- సమస్యలపై మీటింగ్ సమస్యల మద్యే నిర్వహణ
- దోమల పెంపక కేంద్రాలుగా మారిన కార్యాలయాల పరిసరాలు
- గ్రామాలకు కాదు... ముందు మొయినాబాద్ ప్రభుత్వ కార్యాలయాలకే శుభ్రత అవసరం అంటున్న పలువురు సర్పంచులు
- ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరుస్తారా? లేక చెత్త మద్యే పరిపాలన కొనసాగిస్తారా..?
- వేచి చూడాలంటున్న ప్రజలు





**చేవెళ్ల (ప్రజావాయిస్ ):** గ్రామాభివృద్దే దేశాభివృద్ధి... స్వచ్ఛ భారత్ వైపు అడుగులు వేయాలి అంటూ పరిశుభ్రత పై పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఝులిపించే అధికారులు... తమ కార్యాలయాల ముందు పేరుకుపోయిన చెత్తపై మాత్రం మూగవేషం వేయడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కల్గిస్తోంది . మాటలు మామూలు కాదు... కానీ చేతల్లో మాత్రం పూర్తిగా శూన్యం అంటూ స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు.వివరాల్లోకి వెళితే... రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడివో కార్యాలయం పరిసరాలు చెత్తతో పేరుకుపోయి, దోమల పెంపక కేంద్రాలుగా మారాయి.డీసీపీ కార్యాలయం సహా పలు ప్రభుత్వ విభాగాలు ఉన్న ఈ ప్రాంగణానికి ప్రతిరోజూ వందలో సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. కానీ వారికి ఎదురౌతున్నది సేవల కంటే ముందుగా మురికి, దుర్వాసనే.చెత్తకుప్పలు, ప్లాస్టిక్ బ్యాటిళ్లు, పెరిగిన పిచ్చి మొక్కలు, ఎక్కడికక్కడ నీరు నిల్వలు అన్న ప్రశ్నలు ప్రజల నోట ఉత్పన్నమవుతున్నాయి.గ్రామాల్లో ఉన్న సమస్యలను చర్చించాల్సిన వేదిక... సమస్యల మద్యే నిర్వహించాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడింది.ఇది అధికారుల నిండు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం అంటూ సమావేశంలో పాల్గొన్న పలువురు సర్పంచులు ప్రజావాయిస్ పత్రికతో చెప్పారు. ప్రజలకోసం ఏర్పాటు చేసిన మూత్రశాలలు పరిశీలిస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉందని,దుర్వాసనతో నిండిపోయిందని,వాడుకకు పనికి రాని స్థితికి చేరుకున్నాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది నిర్లక్ష్యమా? లేక బాధ్యతారాహిత్యమా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సిన అధికారులే తమ కార్యాలయాల వద్దే విఫలమైతే, గ్రామాల పరిస్థితి ఎలా మారుతోంది ?అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరుస్తారా ? లేక చెత్త మద్యే పరిపాలన కొనసాగిస్తారా? అన్నది మొయినాబాద్ ప్రజల ప్రశ్నగా మారింది.



# పులిచెర్ల గ్రామంలో రెండో వ అంగన్వాడి సెంటర్ ప్రారంభం

- తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ.. కల్తీ లేని సంపూర్ణ ఆహారమే తల్లిపాలు
- ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు
- ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే ఇవ్వాలని ఐసిడిఎస్ ఈవో స్పందన పిలుపు

**ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్:** ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు తల్లిపాలే అత్యంత విలువైన వరమని, కల్తీ లేని సంపూర్ణ ఆహారం తల్లిపాలేనని ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గ్రామ ప్రజలు, గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమం సాగింది.ప్రతి బాలింత తన బిడ్డకు జన్మించిన వెంటనే తల్లిపాలు అందించడం ద్వారా సంపూర్ణ పోషణతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించవచ్చని తెలిపారు. శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలే పునాది అని, ప్రతి కుటుంబం ఈ విషయంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో వారం రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రసవం అనంతరం గంటలోపు శిశువుకు పట్టించే ముర్రుపాలు (కొలస్ట్రం) అత్యంత విలువైనవని, అవి శిశువుకు సహజసిద్ధమైన వ్యాధి నిరోధక శక్తిని అందిస్తాయని వివరించారు.పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. ఆరు నెలల తర్వాత అనుబంధ పోషకాహారాన్ని ప్రారంభించినప్పటికీ, కనీసం రెండున్నర సంవత్సరాల వరకు తల్లిపాలను కొనసాగించడం ద్వారా శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.కార్యక్రమం ద్వారా తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమావత్ ప్రమీల ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకాయమ్మ, ఉపసర్పంచ్ దేవన బోయిన సత్యం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండెబోయిన లక్ష్మయ్య, మాజీ ఎంపిటిసి బుడిగపాక లక్ష్మణ్, వార్డు సభ్యులు, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

- పాడైన కూరగాయల సరఫరాపై ఆగ్రహం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం
- విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించడంలో రాజీ లేదన్న ఎమ్మెల్యే



**శ్రీరంగాపురం ప్రజా వాయిస్ (ఆగస్టు 3):-** వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సోమవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ను ఆకస్మికంగా సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే, వారి చదువు, వసతి, భోజనం, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం వంట గదిని పరిశీలించి అక్కడ వినియోగిస్తున్న వంట సామగ్రి, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, కూరగాయలను స్వయంగా తనిఖీ చేశారు. పాడైపోయిన కూరగాయలను సరఫరా చేసిన విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, నాసిరకం, పాడైన కూరగాయలను సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సంబంధిత బిల్లుల చెల్లింపును తక్షణమే నిలిపివేసి పూర్తి విచారణ నిర్వహించాలని సూచించారు.అనంతరం విద్యార్థుల ఆధునిక విద్య కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంప్యూటర్లు నిరుపయోగంగా ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే, వాటిని వెంటనే మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.డిజిటల్ విద్య ప్రతి విద్యార్థికి అందేలా ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు వృథా కాకుండా చూడాలని స్పష్టం చేశారు.ఉపాధ్యాయుల హాజరు రికార్డును పరిశీలించిన ఎమ్మెల్యే, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని హెచ్చరించారు.ప్రతి విద్యార్థి సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో చదువుకునేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని , ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, సర్పంచ్‌లు మద్దిలేటి, రాముడు, గుంటి మహదేవ్, వెంకటయ్య యాదవ్ ,సుజాత, భారతి, శిరీష, శ్రీహరి రాజు, రాజశేఖర్ రెడ్డి, శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విష్ణు, రామచంద్రయ్య, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల ఆహ్వానం

- ట్రిపుల్ విన్ ప్రాజెక్ట్ ద్వారా జర్మనీ, ఆస్ట్రియాలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాలు

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ సంస్థ అయిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ విదేశీ నియామక సంస్థగా గుర్తింపు పొందిన సంస్థ. ట్రిపుల్ విన్ ప్రాజెక్ట్ ద్వారా జర్మనీ, ఆస్ట్రియాలో ఉద్యోగ అవకాశాల కోసం అర్హత కలిగిన నర్సింగ్ వృత్తి నిపుణుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

**అభ్యర్థుల అర్హతలు:**

తెలంగాణలోని గుర్తింపు పొందిన కళాశాలల నుండి జీఎన్ఎం లేదా బి.ఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఉండాలి లేదా తెలంగాణకు చెందిన నివాసితులై ఉండాలి. వయస్సు 22 నుండి 38 సంవత్సరాల మధ్య ఉండాలి.జీఎన్ఎం/బి.ఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు కనీసం 1–3 సంవత్సరాల వృత్తిపరమైన నర్సింగ్ అనుభవం ఉండాలి. చెల్లుబాటు అయ్యే ఇండియన్ నర్సింగ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.వృద్ధుల సంరక్షణ, పాలియేటివ్ కేర్ రంగాల్లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. (హోమ్ కేర్, నర్సింగ్ హోమ్స్, ఇన్-పేషెంట్ కేర్ మరియు షిఫ్ట్ డ్యూటీలలో అనుభవం కలిగి ఉండటం ప్రయోజనకరం. ఇంటెన్సివ్ కేర్ యూనిట్,ఇంటర్మీడియట్ కేర్ యూనిట్,జెరియాట్రిక్స్ (వృద్ధుల వైద్యం),లాంగ్ టర్మ్ కేర్ యూనిట్స్,కార్డియాలజీ,జనరల్ మెడికల్/సర్జికల్ వార్డ్స్,నియోనేటాలజీ,న్యూరాలజీ,ఆర్థోపెడిక్స్,ఆపరేషన్ థియేటర్ సైకియాట్రీ.ఇప్పటికే బి1 లేదా బి2 స్థాయి జర్మన్ భాషా ధృవీకరణ పత్రం కలిగిన అభ్యర్థులను ఫాస్ట్ ట్రాక్ రిక్రూట్‌మెంట్ ప్రోగ్రామ్ కింద పరిగణించబడతారు.ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ తాజా రెజ్యూమ్‌ను 10 ఆగస్టు 2026 లోపు క్రింది ఈమెయిల్‌కు పంపించాలి:ఈమెయిల్: germanytriplewin2025@gmail.comమరిన్ని వివరాలకు 9440049645,9440052081,9440051581 కు సంప్రదించాలి.



# ఇంజనీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ అన్న సీఎం రేవంత్ రెడ్డియే అసలు క్రిమినల్ వేస్టేజ్

- సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు

**ప్రజా వాయిస్ కగజ్ నగర్** హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు పత్రికా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.ఇంజనీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్‌గా సంబోధించిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రానికి క్రిమినల్ వేస్టేజ్‌గా మిగిలారని హరీష్ బాబు విమర్శించారు. విద్యా, పురపాలక, హోం శాఖలు మూడూ అధోగతి పాలవడంతో అసహనంతో ఇలాంటి ప్రేలాపనలు చేస్తున్నారని తెలిపారు. ప్రైవేటు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లను క్రిమినల్ వేస్ట్‌తో పోల్చిన సీఎం, ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీల అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. బోధనా, బోధనేతర సిబ్బందిని నియమించకుండా ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సోలంకి శ్రీనివాస్, అభిషేక్ జగిని, పవన్ పాల్గొన్నారు.





# కోదాడలో డ్రగ్స్ దందాపై ఉక్కుపాదం

- 6 కిలోల గంజాయి, 38 కోడీన్ సిరప్ బాటిళ్ల స్వాధీనం
- ఏడుగురు నిందితులు, ముగ్గురు బాల నేరస్తులపై ఎన్ డీపీఎస్ కేసు
- ఒడిశా లింక్ బట్టబయలు.. అక్రమ కోడీన్ విక్రయాలపై దర్యాప్తు ముమ్మరం

**ప్రజా వాయిస్,కోదాడ:** మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కోదాడ టౌన్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో భారీగా గంజాయి, కోడీన్ సిరప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో 6 కిలోల గంజాయి, 38 టోసెక్స్ (కోడీన్) సిరప్ బాటిళ్లు, ఒక మోటార్‌సైకిల్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని,ఏడుగురు నిందితులు, ముగ్గురు బాల నేరస్తులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేశారు.డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రధాన నిందితుడు ఒడిశాలోని మల్క నగిరి నుంచి గంజాయి కొనుగోలు చేసి కోదాడలో విక్రయిస్తున్నట్లు విచారణలో అంగీకరించాడు. వైరా రోడ్డులోని ఓ మెడికల్ స్టోర్ ద్వారా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే కోడీన్ సిరప్ విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు 38 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టగా, డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్, ఆర్థిక లావాదేవీలు, ఇతర రాష్ట్రాలతో ఉన్న సంబంధాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోంది. డ్రగ్స్ అక్రమ రవాణాపై జిల్లావ్యాప్తంగా ప్రత్యేక నిఘా కొనసాగుతుందని డీఎస్పీ తెలిపారు.ఈ సమావేశంలో పట్టణ సీఐ శివశంకర్, ఎస్సై అజయ్ కుమార్, క్రైమ్ పార్టీ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ హరిలాల్ నాయక్, కానిస్టేబుళ్లు ఎక్కడ ప్రవీణ్, నాగేంద్రబాబు, లోకేష్, శివ కుమార్, నవీన్ పాల్గొన్నారు.

# వరుస బైక్ చోరీలకు చెక్

- ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్
- CCS-KUC పోలీసుల సంయుక్త ఆపరేషన్ విజయవంతం
- రూ.25 లక్షల విలువైన 28 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- తెలంగాణలోని 7 పోలీస్ కమిషనరేట్ ల పరిధిలో చోరీలు
- సాంకేతిక ఆధారాలతో నిందితుల గుర్తింపు
- పోలీసుల అప్రమత్తతతో బైక్ చోరీల ముఠా గుట్టురట్టు





**హనుమకొండ, ఆగస్టు 3 (ప్రజా వాయిస్):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుసగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల చోరీలకు తెరదించుతూ వరంగల్ CCS, కాకతీయ యూనివర్సిటీ (KUC) పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.25 లక్షల విలువైన 28 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.సెంట్రల్ జోన్ డీసీపీ కవిత ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాల సహాయంతో దర్యాప్తు చేపట్టారు. సోమవారం ఉదయం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బైక్ చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు.అరెస్టైన వారు మంచిర్యాల జిల్లాకు చెందిన దొంతుల ప్రశాంత్ కుమార్ (20), ★దుర్గం సాయి కార్తీక్ (21)★గా పోలీసులు తెలిపారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో తెలంగాణలోని వివిధ జిల్లాల్లో పార్కింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేసినట్లు విచారణలో వెల్లడైంది.నిందితులు ప్రయాణిస్తున్న AP 36 AY 4700 నంబరు గల పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకుని విచారించగా, వారు దాచిపెట్టిన ప్రాంతాల వివరాలు వెల్లడించారు. వారి సూచన మేరకు మునిపల్లి గ్రామ శివారు, ఎలుకతుర్తి సమీప ప్రాంతాల నుంచి మొత్తం 28 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న వాహనాల్లో హోండా షైన్, హీరో స్ప్లెండర్ ప్లస్, హీరో గ్లామర్, హెచ్‌ఎఫ్ డీలక్స్, బజాజ్ పల్సర్, హోండా హార్నెట్ తదితర మోడళ్లకు చెందిన బైకులు ఉన్నాయి. వీటిలో వరంగల్ కమిషనరేట్‌లో 8, కరీంనగర్‌లో 9, రామగుండం–పెద్దపల్లిలో 3, సిద్దిపేటలో 2, హైదరాబాద్‌లో 3, రాచకొండలో 1, భూపాలపల్లి జిల్లాలో 2 చోరీలకు సంబంధించిన వాహనాలుగా పోలీసులు గుర్తించారు.నిందితులపై గతంలోనూ ఆస్తి నేరాలకు సంబంధించిన కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను అసలు యజమానులకు చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన అనంతరం అప్పగిస్తామని వెల్లడించారు.ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన CCS ఇన్‌స్పెక్టర్లు ఏ. రాఘవేందర్, ఈ. హరికృష్ణ, కె. రామకృష్ణ, KUC ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సిబ్బంది, ఐటీ కోర్ టీమ్ సభ్యులను పోలీస్ కమిషనర్ అభినందించారు. మీడియా సమావేశంలో హనుమకొండ, CCS ఏసీపీలు నర్సింహారావు, సదయ్య పాల్గొన్నారు.



# మహిళల సంతకాల ఫోర్జరీతో రూ.21 లక్షల ఫ్రాడ్

- వీఓఏపై కలెక్టర్ కు ఫిర్యాదు
- తమకు న్యాయం చెయ్యాలని కలెక్టర్ ను కోరిన మహిళలు

**ప్రజా వాయిస్ టేక్మాల్ :** మెదక్ జిల్లా టేక్మాల్ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్‌ను ప్రజావాణి కార్యక్రమంలో కలిసి వీఓఏ ఆంజనేయులు పై పిర్యాదు చేశారు.. తమకు తెలియకుండా మహిళా సంఘాల సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి, శ్రీనిధి ద్వారా సుమారు రూ.21 లక్షల రుణం తీసుకున్నారని గ్రామ వీఓఏ ఆంజనేయులుపై వారు ఫిర్యాదులో ఆరోపించారు.ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మహిళలు కలెక్టర్‌ను కోరారు. తమ పేర్లపై తీసుకున్న రుణాల కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఫిర్యాదును స్వీకరించిన కలెక్టర్ ప్రతిమ సింగ్ సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, వాస్తవాలను నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం.మహిళల ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, సంబంధిత అధికారుల విచారణ అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# కాకతీయ వైభవానికి కేంద్రం పెద్దపీట వేయాలి

- కాకతీయ వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి పై పార్లమెంట్ లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** వరంగల్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కాకతీయ వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి అంశాన్ని లోక్‌సభ వేదికగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు. కాకతీయుల చరిత్ర, సంస్కృతి, కళా వైభవం కేవలం తెలంగాణకే కాకుండా దేశానికి గర్వకారణమని, అలాంటి వారసత్వ సంపదకు మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రధానంగా వరంగల్‌కు చరిత్రక గుర్తింపుగా నిలిచిన కాకతీయ కట్టడాలు, సంప్రదాయ కళలు, చేనేత–హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాలు, పర్యాటక అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గత మూడేళ్లలో ఎలాంటి చర్యలు తీసుకుందో వివరించాలని ఎంపీ డా.కడియం కావ్య కోరారు.ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సమాధానం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) పరిధిలో 9 రక్షిత కట్టడాలు ఉన్నాయని, వాటిలో వరంగల్ జిల్లాకు చెందిన కాకతీయ వారసత్వ కట్టడాలు కూడా ఉన్నాయని తెలిపారు. అవసరాలు, నిధుల లభ్యత మేరకు వాటి పరిరక్షణ, నిర్వహణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, కాకతీయ కళా సంపద, చేనేత, హస్తకళలు, సాంస్కృతిక ఉత్సవాల అభివృద్ధికి ఇంకా విస్తృత స్థాయిలో చర్యలు అవసరమని అన్నారు. హెరిటేజ్ సిటీగా వరంగల్‌కు గుర్తింపు లభించినప్పటికీ, నగరంలోని చారిత్రక కట్టడాల అభివృద్ధి పనులు మరింత వేగవంతం కావాలని డా. కడియం కావ్య అభిప్రాయపడ్డారు. వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి వద్ద ప్రపంచ స్థాయి పర్యాటక సదుపాయాలు కల్పిస్తే వేలాది మంది దేశ, విదేశీ పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్నారు.ప్రసాద్ పథకం కింద రామప్ప దేవాలయ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, కాకతీయ వారసత్వానికి సంబంధించిన అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను కేంద్రం రూపొందించాలన్నారు. కాకతీయుల చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రత్యేక సాంస్కృతిక, పర్యాటక ప్రాజెక్టులు చేపట్టాలని కోరారు.వరంగల్ కోట అభివృద్ధికి ఏఎస్ఐ, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మధ్య ఒప్పందం కుదరడం స్వాగతించదగ్గ విషయమని, అయితే పనులు కాగితాలకే పరిమితం కాకుండా త్వరితగతిన పూర్తయ్యేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని సూచించారు."కాకతీయుల వారసత్వం తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, ఈ సంపదను పరిరక్షించడం, భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అన్నారు. వరంగల్ అభివృద్ధి, కాకతీయ వైభవ పునరుద్ధరణ కోసం పార్లమెంట్‌లోనూ, కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనూ నిరంతరం తాను పోరాడుతాను" అని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు.

# ఉద్యోగ హామీ అమలు చేయాలి

- వైటీపీఎస్ గేటు ఎదుట భూ నిర్వాసితుల బైఠాయింపు
- భూములు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్
- ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సంఘీభావం
- హామీలు నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరిక



**ప్రజా వాయిస్,మిర్యాలగూడ.** నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) ప్రధాన గేటు ఎదుట భూ నిర్వాసితులు సోమవారం బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ప్లాంట్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.వైటీపీఎస్ పరిధిలోని తాళ్లవీరప్పగూడెం, వీర్లపాలెం, తిమ్మాపురం, నరసాపురం, కల్లేపల్లి గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భూముల సేకరణ సమయంలో ప్రతి అర్హ కుటుంబానికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఎన్నో సంవత్సరాలు గడిచినా ఆ హామీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.భూములు కోల్పోవడంతో వ్యవసాయ ఆధారిత జీవనోపాధి పూర్తిగా దెబ్బతిందని, కుటుంబాల ఆర్థిక పరిస్థితి సంక్షోభంలోకి వెళ్లిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అర్హులైన నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే, సీపీఎం నాయకుడు జూలకంటి రంగారెడ్డి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాలని, భూములు కోల్పోయిన ప్రతి అర్హ కుటుంబానికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. భూ నిర్వాసితుల న్యాయమైన పోరాటానికి సీపీఎం పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.ఆందోళన నేపథ్యంలో వైటీపీఎస్ పరిసరాల్లో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. భూ నిర్వాసితులు మాత్రం ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం ప్రకటించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.



# ప్రజా వాయిస్ కథనానికి స్పందన

- గోదావరిఖని పశువైద్యశాల సమస్యలపై కదిలిన యంత్రాంగం!

**ప్రజా వాయిస్ గోదావరిఖని:** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 60వ డివిజన్ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గల 60 ఏళ్ల నాటి ప్రభుత్వ పశువైద్యశాల దీనస్థితిపై ప్రచురితమైన ప్రత్యేక కథనానికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించారు.అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన వార్త ఆధారంగా స్పందించిన జిల్లా అధికారులు ఆసుపత్రి ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాకాలంలో కారుతున్న శిథిల భవనం, ప్రాంగణంలో నెలకొన్న పారిశుధ్య లోపం మరియు ప్రమాదకర స్థితిని ప్రత్యక్షంగా తనిఖీ చేసి, నివేదిక సిద్ధం చేశారు. ప్రత్యేక కథనం ద్వారా సమస్యను వెలుగులోకి తెచ్చి, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం పట్ల స్థానిక పశుపోషకులు, రైతులు మరియు 'జన హిత' ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.



శిథిలావస్థలో పశువైద్య

- కూలేందుకు సిద్ధంగా 60 ఏళ్ల నాటి భవనం
- ఇబ్బందుల్లో పశుపోషకులు, రైతులు
- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పందించాలని 'జనహిత' విజ్ఞప్తి

**ప్రజా వాయిస్ గోదావరిఖని** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60వ డివిజన్, పాత మునిసిపాలిటీ ప్రాంతంలో ఉన్న ఏకైక వెటర్నరీ (పశువుల) ఆసుపత్రి తీవ్ర నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరింది. సుమారు 60 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆసుపత్రి భవనం నేడు పూర్తిగా దెబ్బతిని, ఏ క్షణాన కూలిపోతుందో తెలియని ప్రమాదకర స్థితికి చేరుకుంది. సుదూర ప్రాంతాల నుంచి పాడి పశువులకు, జీవాలకు వైద్యం కోసం వచ్చే రైతులకు ఈ ఆసుపత్రి దుస్థితి తీవ్ర నిరాశను కలిగిస్తోంది. భవనం కారడం, పారి ప్రాంగణం నిండిపోవడ సరైన సమయానికి చి లేదని స్థానికులు వా ప్రాంత పశుపోషకుల దృష్టిలో ఉంచుకుని భ్యులు రాజ్ ఠాకూర్ చాలని 'జనహిత' ప్రతి న్నారు. ఎమ్మెల్యే స్వయ పరిశీలించి, నూతన భ నిధులు మంజూరు చే వైద్య సౌకర్యాలు అందు కురావాలని ప్రజలు, చేస్తున్నారు.

# పాల్వంచ జాతీయ రహదారిపై సిపిఎం నాయకుల ఆందోళన

- పూర్తి గుంతల మయంగా మారిన అంబేద్కర్ సెంటర్ రోడ్డు.
- నిత్యం ప్రయాణికుల నరకయాతన ఇంకెన్నాళ్లు
- అంబేద్కర్ సెంటర్లో తక్షణమే నాణ్యత గల రోడ్లను వేయాలంటూ సిపిఎం పార్టీ నాయకుల డిమాండ్



**ప్రజా వాయిస్ పాల్వంచ** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ పరిధిలోని అంబేద్కర్ సెంటర్ నందు జాతీయ రహదారి గుంతల మయంగా మారిపోయింది. నిత్యం విపరీతమైన రద్దీగా ఉండే ఈ సెంటర్లో వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇసుక లారీలు కేటీపీఎస్ వెళ్లే యాష్ లారీలు సారపాక పేపర్ మిల్లు కు వెళ్లే జామాయిల్ కర్ర లారీలు స్కూల్ బస్సులు ఆర్టీసీ బస్సులు కార్లు ట్రాక్టర్లుఆటోలు ద్విచక్ర వాహనాలు ఈ సెంటర్ నుండి తిరగాలి, వ్యాపార సముదాయాలు, సినిమా హాలు లు, ఈ సెంటర్ లోనే ఉండటం వలన ప్రజలు ఎక్కువగా ఇక్కడ కాలినడకన కూడా ఎక్కువగా తిరుగుతుంటారు. ఇంత రద్దీగా ఉండే జాతీయ రహదారి పై శాశ్వత రోడ్డు వేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం ప్రతి నెల జిల్లా కలెక్టర్ మరియు ప్రజా ప్రతినిధులు మంత్రులు ఇక్కడి నుండి రాకపోకలు చేస్తుంటారు. అయినా వీరు,ఎవరు ఈ రహదారి గురించి పట్టించుకోకపోవడం శోచనీయం ఇక్కడే కాదు ఇందిరా కాలనీ నుండి నవభారత్ మైనింగ్ పెట్రోల్ బంక్ వరకు రహదారిపై అక్కడక్కడ ముడులు ముడులుగా గుంతలు గుంతలుగా రోడ్డు ఉండటం వలన ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మధ్య ఎక్కువగా యాక్సిడెంట్లు కావడం వలన నలుగురు చనిపోవడం జరిగింది. అయినా అధికారులు రహదారి మరమ్మతులు చేయించడంలో రోడ్డు వేయడంలో విఫలమవుతున్నారు,ఇప్పటికైనా అధికారులు మైనింగ్ పెట్రోల్ బంక్ నుండి ఇంద్ర కాలనీ వరకు జాతీయ రహదారి మొత్తం రోడ్డు వేయాలని, ముఖ్యంగా అంబేద్కర్ సెంటర్లో వెంటనే రోడ్డు పనులు మొదలు పెట్టాలని సిపిఎం పార్టీ పట్టణ కమిటీ,కార్పొరేషన్ అధికారులను, ఆర్ అండ్ బి,జాతీయ రహదారి అధికారులను డిమాండ్ చేశారు. రోడ్డు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తే టౌన్ పార్టీ నాయకత్వంలో జాతీయ రహదారి పై భారీ రాస్తారోకో కూడా చేస్తామని కేసులు పెట్టిన జైళ్లకు పంపిన భయపడేది లేదని పార్టీ నాయకులు అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎం జ్యోతి కమిటీ సభ్యులు దొడ్డ రవికుమార్ పట్టణ కార్యదర్శి పి తులసి రామ్ కార్యవర్గ సభ్యులు కే సత్య, తదితరులు పాల్గొన్నారు.



# చెత్త పేరుకుపోవడంతో కాలనీ వాసులకు ఇబ్బందులు

- ప్రతి రోజూ చెత్తను తొలగించిలాని కాలనీ వాసుల వినతి.
- మున్సిపల్ అధికారులకు వినతి పత్రం సమర్పణ

**ప్రజా వాయిస్ జహీరాబాద్:** మున్సిపల్ పట్టణ పరిధిలోని వార్డు నెం 31 నల్సబ్ మొహెళ కాలనీలో ఇంటి ముందు చెత్త పేరుకుపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు సోమవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అంతేకాకుండా కొందరు వ్యక్తుల ఇంటి సమీపంలోనే చెత్తను పారవేయడంతో దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు, ఈగలు అధికమై ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ కమీషనర్ కు కాలనీ వాసులు విన్నవించుకున్నారు.కావున చెత్తను వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని భవిష్యత్తులో అక్కడ చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేసి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సోమ అనిల్, మహదేవ్, శంకర్, రవి, శ్రీకాంత్, అజయ్,యండి ఫయాజ్, సాయి తదితరులు ఉన్నారు..



## ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు నాణ్యమైన విద్య

- రోజుల శిక్షణ ప్రారంభం

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో సోమవారం జిల్లాలోని 118 ప్రభుత్వ ప్రీ–ప్రైమరీ పాఠశాలల ఇన్‌స్ట్రక్టర్ల కోసం 4 రోజుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ ప్రారంభించారు.చిన్నారుల జీవితంలో తొలి 5 సంవత్సరాలు అత్యంత కీలకమని, ఈ దశలో అందించే విద్య భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందని యువరాజ్ మర్మాట్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ–ప్రైమరీ విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని, ఇన్‌స్ట్రక్టర్లు పిల్లలతో ప్రేమ, ఆప్యాయత, ఓర్పుతో వ్యవహరిస్తూ ఆటలు, పాటలు, కథలు, సృజనాత్మక కార్యకలాపాల ద్వారా అభ్యాసనాన్ని ఆనందదాయకంగా మార్చాలని సూచించారు.శిక్షణలో బాలల మనోవిజ్ఞానం, ఆటల ఆధారిత బోధన, భాషా వికాసం, సంఖ్యా అవగాహన, తరగతి గది నిర్వహణ, బోధన–అభ్యసన సామగ్రి వినియోగం, తల్లిదండ్రులతో సమన్వయం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. నేర్చుకున్న అంశాలను ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేసి ప్రభుత్వ ప్రీ–ప్రైమరీ విద్యను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఇన్‌స్ట్రక్టర్లకు సూచించారు.

## అసలే ప్రమాదకరమైన పని.. ఆపై బాల కార్మికులతో శ్రమ



- 'ఆపరేషన్ ముస్కాన్' విజయమంటున్న అధికారులు
- పుల్కల్ ఘటనపై ప్రశ్నలు
- ఎస్పీ కార్యాలయానికి 6 కి.మీ. దూరంలోనే బాల కార్మికులు పనిచేస్తున్నారంటూ ఆరోపణలు

**సంగారెడ్డి, ప్రజా వాయిస్:** జిల్లాలో 'ఆపరేషన్ ముస్కాన్' పేరుతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బాల కార్మికులను గుర్తించి రక్షించామని అధికారులు ప్రకటిస్తున్న వేళ, ఎస్పీ కార్యాలయానికి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలోనే బాల కార్మికులు ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి.పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చార్మినార్ బ్రూవరీస్ కంపెనీ ఎదురుగా ఉన్న పాత సీసాల గోదాంలో బాల కార్మికులు పనిచేస్తున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. గోదాంలో ఎక్కడ చూసినా పగిలిన గాజు సీసాలు, ప్రమాదకర వ్యర్థాలు ఉండటంతో అక్కడ పని చేయడం అత్యంత ప్రమాదకరమని స్థానికులు చెబుతున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇలాంటి ప్రమాదకర పనుల్లో కార్మికులకు భద్రతా పరికరాలు, రక్షణ చర్యలు కల్పించిన తర్వాతే పని చేయించాలి. అయితే అక్కడ పనిచేస్తున్న వారికి సరైన భద్రతా సామగ్రి అందించకుండా కేవలం చేతులకు గుడ్డలు చుట్టించి పని చేయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.స్థానికుల కథనం ప్రకారం, గతంలో కూడా పగిలిన గాజు సీసాల వల్ల పలువురు కార్మికులకు తీవ్ర గాయాలై, కాళ్లకు లోతైన కోతలు పడి అనేక కుట్లు వేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని చెబుతున్నారు. అయినప్పటికీ భద్రతా చర్యల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదని వారు అంటున్నారు.అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే, చిన్నారులతోనే ఈ ప్రమాదకర పనులు చేయిస్తున్నట్లు ఆరోపణలు రావడం. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అధికారులు ప్రకటిస్తున్న సమయంలోనే ఇటువంటి ఘటన వెలుగులోకి రావడం పలు ప్రశ్నలకు తావిస్తోంది.ఈ వ్యవహారంలో సంబంధిత కాంట్రాక్టర్, గోదాం నిర్వాహకులపై కార్మిక శాఖ, పోలీసు శాఖ, బాలల సంక్షేమ శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి, బాల కార్మికులు ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## మానవత్వం చాటుకున్న భీమ్ ఆర్మీ చీఫ్ సిద్ధూ రావణ్

- పదవుల కంటే తోటి మనుషులకు సహాయం చేయడమే గొప్పగుణం
- దీనస్థితిలో ఉన్న యువకుడికి తానే స్వయంగా దుస్తులను కొనిచ్చి ధరింపజేసిన వైనం



**ప్రజా వాయిస్ జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో కష్టాల్లో ఉన్నవారిని చూసి కరిగిపోయే మనసే నిజమైన సమాజ సేవకు నిదర్శనమని తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్, శాంతి ఫౌండేషన్ చైర్మన్ సిద్ధూ రావణ్ నిరూపించారు. జహీరాబాద్ జాతీయ రహదారిపై నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఒక అనాథ యువకుడికి తక్షణ సహాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. సోమవారం జాతీయ రహదారి గుండా ప్రయాణిస్తున్న సమయంలో, రోడ్డు పక్కన ఆకలితో, అదేవిధంగా చిరిగిన దుస్తులతో అత్యంత దీనస్థితిలో ఉన్న ఒక యువకుడు సిద్ధూ రావణ్ కంటపడ్డాడు. ఆ దృశ్యాన్ని చూసి తీవ్రంగా చలించిపోయిన వెంటనే తన వాహనాన్ని ఆపి, ఆ యువకుడి వద్దకు వెళ్ళి అతడి పరిస్థితిని అడిగి తెలుసుకొని, స్వయంగా సదరు యువకుడికి కడుపునిండా అన్నం తినిపించి, తాగునీరు అందించారు.వణుకుతున్న ఆ యువకుడికి తక్షణమే నూతన వస్త్రాలు కొనుగోలు చేసి అందజేశారు.అతనికి అవసరమైన ప్రాథమిక సహాయం అందించి, సురక్షిత ప్రాంతానికి చేర్చే ఏర్పాట్లను కూడా చేశారు.మార్గమధ్యలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు, స్థానిక ప్రజలు సిద్ధూ రావణ్ చేసిన ఈ సేవను దగ్గరుండి చూసి అభినందనల వర్షం కురిపించారు. పదవుల కంటే తోటి మనుషులకు సహాయం చేయడమే గొప్ప గుణమని ఆయనను కొనియాడారు. అదేవిధంగా సమాజంలో ఆపదలో ఉన్నవారికి, నిరుపేదలకు చేయూత నివ్వడమే నిజమైన మానవత్వం. ప్రతి ఒక్కరూ తమకు తోచిన రీతిలో బాధితులకు సహాయం చేయడానికి ముందుకు రావాలని సిద్ధూ రావణ్, తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ మరియు శాంతి ఫౌండేషన్ చైర్మన్ పిలుపునిచ్చారు.

## వర్గల్ క్షేత్రంలో...ముగిసిన వరుణ యాగం

- శ్రీ చంద్రమౌళీశ్వర స్వామికి జలాభిషేకం చేసిన సిద్ధాంతి చంద్రశేఖర శర్మ
- పది రోజులపాటు క్షేత్రంలో వైభవంగా మహా రుద్రాభిషేకం
- లోక కళ్యాణార్థమే ఈ మహత్కార్యం
- ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ చంద్రశేఖర శర్మ సిద్ధాంతి



**ప్రజా వాయిస్, గజ్వేల్ :**తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రకృతి కరుణించాలని కాంక్షిస్తూ ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో బ్రహ్మశ్రీ చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వరుణ యాగం వైభవంగా జరిగింది. లోక కళ్యాణార్థమై నిర్వహించిన ఈ మహా రుద్రాభిషేకంలో వేద పండితులు, ఆలయ అర్చకులు, గురువులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా పది రోజుల పాటు ఘనంగా జరిగిన ఈ మహత్కార్యం సత్ఫలితాలు ఇవ్వాలని కాంక్షిస్తూ శ్రీ చంద్రమౌళీశ్వర స్వామివారికి సోమవారం జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా పడాలని కాంక్షిస్తూ యజ్ఞ యాగాదులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ముఖ్యంగా వేద పండితులు నిర్వహించే విశేష వైదిక క్రతువు వరుణ యాగంతో ప్రకృతి కనికరిస్తుందని, పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని స్పష్టం చేశారు. మూల మంత్ర హోమము, ప్రత్యేక కలశ పూజలు, మహా రుద్రాభిషేకం తదితర నిర్వహించగా, శ్రీ పరమేశ్వరుడి కృప కోసం ప్రతినిత్యం ఆలయ సముదాయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. అయితే రైతులు సుభిక్షంగా పంటలు పండించాలని తమ లక్ష్యం కాగా, ఆ దిశగా క్షేత్రంలో ఈ పుణ్యకార్యం నిర్వహించినట్లు సిద్ధాంతి చంద్రశేఖర శర్మ వివరించారు.



## వెల్ నెస్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలి

### హనుమకొండ జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** వెల్ నెస్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు.సోమవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల పక్కన ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్లకు వైద్య సేవలను అందించే వెల్ నెస్ సెంటర్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్ నెస్ సెంటర్ లోని జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెంటల్, కంటి విభాగం, ల్యాబ్, ఫార్మసీ, ఓపీ విభాగాలను పరిశీలించారు. ఎంతమంది వైద్యులు, సిబ్బంది విధులకు హాజరయ్యారని అదనపు కలెక్టర్ వెల్ నెస్ సెంటర్ ఇన్ ఛార్జ్ డాక్టర్ సుష్మితను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. అక్కడికి వైద్య సేవల నిమిత్తం వచ్చిన పేషంట్లతోనూ మాట్లాడి వైద్య సేవలు ఎలా ఉంటున్నాయని అడిగారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ వెల్ నెస్ సెంటర్ కు వచ్చే పేషంట్లకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. వెల్ నెస్ సెంటర్ వద్ద పరిసరాలు బాగుండాలన్నారు. ప్రత్యేక విభాగాల వైద్య నిపుణుల చేత కూడా వైద్య సేవలను పేషంట్లకు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ల్యాబ్ ద్వారా పేషంట్లకు అవసరమయ్యే వివిధ పరీక్షలని నిర్వహించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, వైద్యులు పాల్గొన్నారు.



## షీ టీమ్స్ ఆధ్వర్యంలో కిష్టంపేట పాఠశాలలో విద్యార్థులకు భద్రత సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**ప్రజా వాయిస్ /చెన్నూర్** రామగుండం పోలీస్ కమిషనరేట్, మంచిర్యాల జోన్ పరిధిలోని షీ టీమ్స్ ఆధ్వర్యంలో సోమవారం చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత భద్రత,సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, రహదారి భద్రతపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా షీ టీమ్స్ సిబ్బంది మాట్లాడుతూ, మహిళలు,బాలికల భద్రతకు షీ టీమ్స్ నిరంతరం సేవలందిస్తున్నాయని తెలిపారు.షీ టీమ్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని,సైబర్ నేరాలకు సంబంధించిన మోసపూరిత సందేశాలు, అనుమానాస్పద లింకులు, అపరిచితుల ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అలాగే మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు.ప్రతి విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు.అత్యవసర పరిస్థితులు లేదా వేధింపులు ఎదురైన వెంటనే డయల్–100కు సమాచారం అందించాలని,అలాగే రామగుండం షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 8712659385లకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ కానిస్టేబుళ్లు వనిత,సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల నమ్మకం.. పెరుగుతున్న ఆదరణ

- హుస్నాబాద్ ప్రభుత్వ దావఖాన దినదిన అభివృద్ధి!
- రోజురోజుకూ పెరుగుతున్న ఓపీ రద్దీ
- వైద్యుల కొరతను తీర్చాలని రోగుల విజ్ఞప్తి



**ప్రజా వాయిస్ హుస్నాబాద్** హుస్నాబాద్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి దినదిన అభివృద్ధి చెందుతూ ప్రజల ఆదరణను విశేషంగా పొందుతోంది. గతంతో పోలిస్తే ఆసుపత్రిలో మౌలిక వసతులు మరియు ఉచిత వైద్య సేవలు గణనీయంగా మెరుగుపడటంతో, నిత్యం వందలాది మంది రోగులు చికిత్స కోసం ఇక్కడికి తరలివస్తున్నారు. సామాన్య, నిరుపేద ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తుండటంతో హుస్నాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఈ దావఖాన కొండంత అండగా నిలుస్తోంది. ప్రజల్లో ఆసుపత్రిపై రోజురోజుకూ నమ్మకం పెరగడంతో ప్రతిరోజు వచ్చే ఔట్ పేషెంట్ల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది.అయితే, రోజురోజుకూ పెరుగుతున్న రోగుల రద్దీకి అనుగుణంగా ఆసుపత్రిలో డాక్టర్ల సంఖ్య లేకపోవడం కొంత ఇబ్బందికరంగా మారింది. ఆసుపత్రిలో ఉన్న వైద్యుల కొరతను వెంటనే నివారించి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని రోగులు మరియు స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించి ఆసుపత్రిలో ఖాళీలను పునరుద్ధరిస్తే, పేద ప్రజలకు మరింత వేగంగా మరియు మెరుగైన వైద్య సేవలు అందుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారిస్తే హుస్నాబాద్ దావఖాన ఈ ప్రాంతంలోనే అత్యుత్తమ వైద్య నిలయంగా మారుతుందనడంలో సందేహం లేదు.



## నీట్‌లో రాష్ట్ర స్థాయిలో 649వ ర్యాంక్ సాధించిన దాసరి అశ్వితకు ఘన సన్మానం

**ప్రజా వాయిస్ మహాదేవపూర్ ప్రతినిధి**534 మార్కులతో ప్రతిభ చాటిన విద్యార్థినిని మహాదేవపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శాలువాతో సత్కరించిన చైర్మన్, చల్ల తిరుపతిరెడ్డి కార్యవర్గ సభ్యులుఇటీవల నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్–2026)లో 534 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 649వ ర్యాంక్‌ను కైవసం చేసుకున్న దాసరి అశ్వితను మహాదేవపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆమె సాధించిన ఈ విజయాన్ని అభినందిస్తూ సంఘం చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.దాసరి అశ్విత, మహాదేవపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యవర్గ సభ్యుడు దాసరి సమ్మయ్య కుమార్తె. కఠోర శ్రమ, పట్టుదల, లక్ష్యసాధనతో నీట్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ సాధించడం అభినందనీయమని చైర్మన్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సరైన ప్రణాళిక, కృషితో ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని ఆమె విజయం మరోసారి నిరూపించిందన్నారు.ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యుడు చీర్ల తిరుపతి రెడ్డి, సంఘ సిబ్బంది అశ్వితకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో వైద్య విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆమె మరెన్నో విజయాలు సాధించి మహాదేవపూర్ ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో సంఘం సిబ్బంది, కార్యవర్గ సభ్యులు పాల్గొని అశ్వితను అభినందించారు. ఆమె సాధించిన విజయం గ్రామ యువతకు ఆదర్శంగా నిలుస్తుందని, ఇటువంటి విజయాలు మరింత మంది విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయని వారు పేర్కొన్నారు.

## రియల్టర్ల దౌర్జన్యం అధికారుల నిర్లక్ష్యం

- షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్
- బీరప్ప స్వామి దేవాలయం పిల్లర్లు స్టీల్ తొలగించడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే
- అక్రమ లేఅవుట్లపై సమగ్ర విచారణకు డిమాండ్
- పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోతే న్యాయపోరాటంతో పాటు ప్రజా ఉద్యమం చేపడతామని స్పష్టీకరణ

( **ప్రజా వాయిస్ షాద్‌నగర్** )ఫరూక్‌నగర్ ప్రాంతంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన బీరప్ప గడ్డ, కురుమ కులస్థుల ఇష్టదైవమైన బీరప్ప స్వామి దేవాలయాన్ని కూల్చివేయడం అత్యంత దారుణమని భక్తుల విశ్వాసాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ తీవ్రంగా విరుచుకుపడ్డారు.షాద్‌నగర్ పట్టణంలోని సీఎస్కే విల్లాస్ వెంచర్‌లో బీరప్ప స్వామి దేవాలయ నిర్మాణాలను కూల్చివేసిన ఘటనపై సోమవారం సాయంత్రం అంజయ్య యాదవ్ స్థానిక నాయకులు, కౌన్సిలర్లతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రైతులను ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి మోసపూరితంగా భూములు స్వాధీనం చేసుకుని లేఅవుట్లు వేయడం అక్రమమని మండిపడ్డారు తమ పూర్వీకుల కాలం నాటి దేవాలయం పిల్లర్లు, స్టీల్ సామగ్రిని దౌర్జన్యంగా తొలగించడం దారుణమన్నారు పక్కనే ఉన్న రైతులు భూములు అమ్మకపోయినా రిజిస్ట్రేషన్ కాకపోయినా అక్రమంగా లేఅవుట్లలో కలిపేశారని అంజయ్య యాదవ్ ఆరోపించారు లేఅవుట్ అనుమతులు ఇచ్చే ముందు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండా ధనవంతుల మాటలు విని ప్రజలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు ఈ ఘటనపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి బాధ్యులను అరెస్ట్ చేయాలని లేని



పక్షంలో న్యాయపోరాటంతో పాటు పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అందే బాబాయ్య, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, జయలక్ష్మి కిషోర్, ఎస్పీ శివ, మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ పీఎసీఎస్ చైర్మన్ విఠల్, మాజీ కౌన్సిలర్ జూపల్లి శంకర్, చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, రవి యాదవ్, నందిగామ శ్రీనివాస్, బిక్షపతి, చెర్క శివ, పాండు, సాయి మరియు కురుమ కుర్వ సంఘం నాయకులు పాల్గొన్నారు.